www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శుక్రవారం, 28.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 298
పేజీలు: 08 వెల: రూ. 5

పాఠకులకు
రాఖీ పండుగ
శుభాకాంక్షలతో

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి
ప్రతీకమైనది రాఖీ..
పాఠకులకు ఆనందాలు,
ఆరోగ్యం, ఐశ్వర్యాలు
తీసుకురావాలని ఆకాంక్షిస్తూ
రాఖీ శుభాకాంక్షలు

తెలంగాణలో

సస్పెన్షన్ బ్రిడ్జి పనులను
పరిశీలించిన సీఎం

## వాటర్ స్పోర్ట్స్

### మీరాలం చెరువుపై సీఎం ఫోకస్

- నిర్మాణాల ఫొటో ప్రదర్శన
- చెరువులోకి మురుగు చేరకుండా చర్యలు
- మూసీలోకి వరద వెళ్లేలా నాలా విస్తరణ
- వాటర్ స్పోర్ట్స్ కు అనుగుణంగా ప్రత్యేక డిజైన్
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం

02



అందిపుచ్చుకోని

# కమలం



### కాంగ్రెస్‌పై పెరుగుతున్న అసంతృప్తి?
### బీఆర్ఎస్ బలహీనత..

- అయినా బీజేపీకి ఎందుకు కలిసి రావడం లేదు?
- ఒక్క చాన్స్ అడగలేకపోతున్న కమలం..
- తెలంగాణలో బీజేపీకి ఇదే పెద్ద మైనస్!
- 8 ఎంపీ సీట్లు గెలిచినా.. బీజేపీ ఎందుకు బలపడలేకపోతోంది?
- తెలంగాణలో బీజేపీకి బంగారు అవకాశం..
- క్యాష్ చేసుకోవడంలో ఎందుకు ఫెయిల్?
- సీఎం ఫేస్ ఎవరు? బీజేపీని వేధిస్తున్న కీలక ప్రశ్న!
- గ్రూపు రాజకీయాలతో సతమతం..
- తెలంగాణ బీజేపీకి నాయకత్వ లోపమే శాపమా?
- బెంగాల్ తరహా పోరాటం అవసరమేనా?
- తెలంగాణ బీజేపీకి కొత్త వ్యూహం తప్పదా?
- ఇప్పటికైనా మారకపోతే కష్టమే..
- తెలంగాణ బీజేపీ ముందు బిగ్ ఛాలెంజ్!



**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత మార్పు కోరుకున్న ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు, పరిపాలన, అంతర్గత విభేదాల విషయంలో ఎదుర్కొంటున్న సవాళ్లు ప్రజల్లో కొంత అసంతృప్తికి కారణమవుతున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ కూడా గతంలో ఉన్న రాజకీయ ప్రభావాన్ని క్రమంగా కోల్పోతోంది. దీంతో రాష్ట్రంలో బీజేపీకి ఒక స్పష్టమైన రాజకీయ ఖాళీ కనిపిస్తోంది. కానీ ఈ అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మలచుకోవడంలో కమలం ఆశించిన స్థాయిలో సాగడం లేదు.

**'ఒక్క అవకాశం' నినాదం ఎక్కడ?**
కేసీఆర్ పదేళ్ల పాలన చూశారు.. కాంగ్రెస్ పాలనను కూడా చూస్తున్నారు.. ఇక ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి అనే బలమైన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాష్ట్ర నాయకత్వం విఫలమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు గెలుచుకున్న బీజేపీ.. అదే ఊపును అసెంబ్లీ రాజకీయాల్లోకి తీసుకురాలేకపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ ఇమేజ్, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆధారపడటం మాత్రమే కాకుండా.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుంది? ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తుంది? అనే అంశాలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. మిగతా 02లో



## కబళించిన మృత్యువు

### పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం



- ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు
- ఏడుగురు అక్కడికక్కడే మృతి
- మృతులంతా వేలూరు గ్రామానికి చెందిన వారిగా గుర్తింపు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశం

02

కొండా సురేఖ

## పవర్ కట్!

### ఇదే కాంగ్రెస్ ప్లానా?



- అధికారుల డిప్యూటేషన్లు రద్దు..
- మాజీ ఓఎస్డీపై విచారణ వేగం
- నేరుగా తొలగించకుండా..

రాజకీయంగా ఒంటరి చేసే వ్యూహమా?

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా ఉన్న సురేఖకు ముందస్తు సమాచారం లేకుండానే.. ఆమెకు అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్న 20 మందికి పైగా అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేయ డం చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్‌కు సంబంధించిన పాత సెటిల్‌మెంట్ ఆరోపణలపై విచారణ వేగం పుంజుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.

**నేరుగా వేటు వేయకుండా.. పవర్ కట్?**
సురేఖను నేరుగా మంత్రి పదవి నుంచి తొలగిస్తే రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంద న్న అంచనాలు కాంగ్రెస్‌లో ఉన్నాయనే చర్చ సాగుతోంది. ముఖ్యంగా బీసీ మహిళా నేతను ప్రభుత్వం తొలగించిందనే ప్రచారం జరిగితే.. అది పార్టీకి ఇబ్బందికరంగా మారే అవకాశం మిగతా 02లో



## గవర్నర్‌కు అస్వస్థత

### యశోద ఆస్పత్రికి సీఎం

- గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులతో ఆరా
- వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

అనారోగ్య కారణాలతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి లో చేరిన తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చికిత్స అనంతరం ఇవాళ మధ్యాహ్నం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం రాత్రి యశోద ఆస్పత్రి నిపుణులైన వైద్యుల బృందం గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు గుండె సంబంధిత శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేశారు. కాగా ఇవాళ ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను నేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా పూర్తి కోలుకోవాలని ఆకాంక్షించిన విషయం తెలిసిందే.

-ముద్ర డెస్క్

## హరీష్ రావు అరెస్ట్

### ఆంక్షలు దాటి కలెక్టరేట్‌కు



- హన్మకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత..
- కలెక్టరేట్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు
- భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
- భారీగా పోలీసు బలగాల మోహరింపు

02

## ఒలింపిక్స్‌కు రెడీగా ఉండండి: మోదీ



- యువ క్రీడాకారులకు మోదీ కీలక సందేశం..
- పతకాలే కాదు.. దేశ నిర్మాణంలో క్రీడలు
- యువ క్రీడాకారులే భవిష్యత్..
- 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా మోదీ కీలక ప్రకటన

02

## నేపాల్ వరదల్లో 288 మంది ఇండియన్స్ గల్లంతు

02



- మానస సరోవర యాత్రికులే అధికం
- మొత్తం 1,600 మందికి పైగా గల్లంతు: విదేశాంగశాఖ

ఇదీ AI ముద్ర



## రాగులతో షుగర్ నియంత్రణకు తోడ్పాటు



రాగుల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది. దీంతో భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా సహాయపడవచ్చు.

# కబళించిన మృత్యువు

**ముద్ర, అమరావతి :**
పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, చిలకలూరిపేట వద్ద ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారని అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ ను చీల్చే కుట్ర

## రహస్యంగా మెదక్ ఎమ్మెల్యేలతో మంతనాలు

**కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచేందుకు పన్నాగాలు**

**రేవంత్ రెడ్డితో లండన్‌లో హరీష్ భేటీ**

**టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు**

**ముద్ర, హైదరాబాద్ :**
'బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు గుంటనక్క కుట్ర. మెదక్ ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు చేస్తున్నారు. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే ప్రయత్నం చేస్తున్నారు. అటు గుంపుమేస్త్రీ, ఇటు బీజేపీతో దోస్తానా?' అని మాజీ ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రా వ్యాపార సంస్థలతో రూ.వేల కోట్ల పాల వ్యాపారం చేశారని.. గుంటనక్క, గుంపుమేస్త్రీ మధ్య లండన్‌లో లాలుచీ చేస్తున్నారని ఆరోపించారు. 'లండన్ మీటింగ్ వివరాలు ఒక్కొక్కటిగా బయట పెడుతున్నాం. ముఖ్యమంత్రి పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదు ఆంధ్రా రేవంత్ రెడ్డి. తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడుతూ ఆంధ్రా ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు' అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ రెడ్డి తాకట్టు పెడుతున్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ మాట్లాడటం లేదని.. కాంగ్రెస్ పార్టీతో పూర్తిగా కాంప్రమైజ్ అయిపోయిందని తెలిపారు. ఒడిశా అమ్మాయి చనిపోయినా బీఆర్ఎస్ పార్టీ మాట్లాడడం లేదు. తెలంగాణకు అన్యాయం జరిగిన మాట్లాడటం లేదు. లండన్ లాలూచీ కారణంగానే బీఆర్ఎస్ పార్టీ మాట్లాడటం లేదా? కొన్ని రోజుల కిందట లండన్‌లో గుంపుమేస్త్రీ, గుంటనక్క మధ్య మీటింగ్ జరిగింది. గుంటనక్కకు చాలా వ్యాపార సంబంధాలు ఉండడంతోనే మాట్లాడటం లేదు. ఇక ఆంధ్రావాళ్లతో కేటీఆర్‌కు వ్యాపార సంబంధాలు, దోస్తులు ఉండటంతో ఆయన మాట్లాడటం లేదు' అని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు.
'నిజంగా లండన్‌లో గుంటనక్కతో లాలూచీ లేకపోతే ఆయన మీద క్విడ్‌ప్రోకో కేసు నమోదు చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నా. ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్ రావు కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున పాలు పోసి వ్యాపారం చేశాడు. ఒక్క నారాయణ, చైతన్య కాలేజ్‌లకే నెలకు రూ.5 కోట్ల చొప్పున 8 ఏళ్లుగా రూ.960 కోట్ల వ్యాపారం చేశాడు. ఇంకా కార్పొరేట్ హాస్పిటల్స్ కిమ్స్, కామినేని, యశోద వంటి హాస్పిటల్స్‌కు కూడా ఆయన పాలు పోశాడు. ఆరోగ్య శాఖ మంత్రిగా ఉంటూ ఇలా ఆంధ్రావాళ్ల పాల వ్యాపారం చేయటం క్విడ్‌ప్రోకో కాదా?' అని ప్రశ్నించారు. 'గుంటనక్కతో రేవంత్ రెడ్డికి లాలూచీ లేకపోతే లండన్‌లో ఒప్పందం జరగకపోతే ఆయనపై క్విడ్‌ప్రోకో కేసు నమోదు చేయాలి. కరీంనగర్ డెయిరీ, ముల్కనూరు డెయిరీ, మదర్ డెయిరీ, విజయ డెయిరీ లాంటి వాళ్లకు 5 మంది పైగా విద్యార్థులు ఉన్న చోట పాలు వాళ్లే పోసేలా జీవో ఇవ్వాలి. ప్రభుత్వంతో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కాంప్రమైజ్ అయ్యింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ వ్యవస్థీకృత అవినీతికి పాల్పడింది' అని మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శలు చేశారు.
'పాల వ్యాపారం ఒకరికి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకరికి, ఇసుక వ్యాపారం ఒకరికి అన్నట్లు పంచుకొని వ్యవస్థీకృత అవినీతి చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందంటూ మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెబుతున్నారు. వ్యవస్థీకృతమైన అవినీతికి పాల్పడిన పార్టీని మళ్లీ అధికారంలోకి తెద్దామా?' అని కవిత ప్రశ్నించారు. జవాబుదారీతనంతో, అవినీతి లేకుండా, కొత్తవాళ్లకు అవకాశం కల్పించేందుకు మేము పార్టీ పెట్టాం. మా లాంటి పార్టీకి అవకాశం కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
'ఇటీవల మెదక్ ఎమ్మెల్యేలతో హరీశ్ రావు మీటింగ్ పెట్టారు. కేసీఆర్ ఎన్టీఆర్‌లాగా పెద్ద మనిషి. కానీ ఆయన కొడుకు వారసత్వం ఇవ్వడం సరికాదంటూ ఆయన వారితో అన్నారు. అందులో ఉన్న ఒక ఎమ్మెల్యేనే నాకు ఈ విషయాలు చెప్పారు. ఎన్టీఆర్ పేరు తీసుకున్నారంటే గుంటనక్క వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైందన్నమాట. పూర్తిగా బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకొని ఆ తర్వాత బీజేపీ మద్దతు తీసుకోవాలని హరీశ్ రావు కుట్ర చేస్తున్నాడు.
'బీజేపీతో మిలాఖత్ ఉందని నేను చెప్పటానికి నా దగ్గర ఆధారాలు ఉన్నాయి. రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్‌లో ఒక ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు వచ్చినప్పుడల్లా ఆయనకు పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తుంటాయి. ఆ రోజు హరీష్ రావు పూర్తిగా తన కార్యక్రమాలను రద్దు చేసుకోని ఆయనతో మీటింగ్ పెడతాడు. నేను ఇప్పుడు బీఆర్ఎస్‌లో లేను. ఆ పార్టీ ఎలా పోయినా నాకు సంబంధం లేదు. కానీ తిన్నింటి వాసాలు లెక్కపెట్టే గుంటనక్క గురించి తెలియాలని చెబుతున్నా. ఇప్పుడున్న రేవంత్ రెడ్డితో కచ్చితంగా ఆయనకు లాలూచీ ఉంది' అని మాజీ ఎమ్మెల్సీ కవిత ఆరోపణలు చేశారు.



# ఒలింపిక్స్ కోసం రెడీగా ఉండండి

**ముద్ర ఢిల్లీ:**
జాతీయ క్రీడా దినోత్సవం 2026 వేడుకల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'ఖేలో ఇండియా డైలాగ్'ను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం పతకాలు సాధించడమే కాదని, వాటిని దేశ నిర్మాణ ప్రక్రియలో అంతర్భాగం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 'ఒలింపిక్స్‌లో ఎన్నో రకాల క్రీడలు ఉన్నాయి.



కానీ అందులో సగం విభాగాల్లో కూడా భారత జట్లు కనీసం పాల్గొనడం లేదు' అని మోదీ వ్యాఖ్యానిస్తూ, దీనిని ఒక 'చేదు నిజం'గా అభివర్ణించారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 32 క్రీడలు ఉండగా, భారత్ కేవలం 16 విభాగాల్లో మాత్రమే ప్రాతినిధ్యం వహించింది. పతకాల పట్టికలో అధిక సంఖ్యలో ఉండే విభాగాల్లో మనం అసలు పోటీకే వెళ్లడం లేదు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలు ఆయా క్రీడల్లో పతకాలు సాధిస్తుంటే, మనం మాత్రం కనీస ప్రాతినిధ్యం కూడా చూపలేక పోతున్నాం. మన పతకాల సంఖ్యను గణనీయంగా పెంచుకోవాలంటే, ఆయా క్రీడా విభాగాల్లోనూ పట్టు సాధించాల్సిన అవసరం ఉంది అని ప్రధాని వివరించారు.
ఒలింపిక్స్‌లో దేశ భాగస్వామ్యాన్ని మెరుగుపరిచే దిశగా 5 నుంచి 15 ఏళ్ల వయస్సు గల బాలబాలికల్లోని ప్రతిభను వెలికితీసేందుకు దేశవ్యాప్త టాలెంట్ హంట్‌ను చేపడుతున్నట్లు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఎర్రకోట వేదికగా ఆగస్టు 15న దేశ క్రీడా ముఖచిత్రంపై ఒక స్పష్టమైన దృక్పథాన్ని ఆవిష్కరించాను. క్రీడలంటే కేవలం పతకాలకే పరిమితం కాదు. వికసిత భారత్ నిర్మాణంలో దేశ క్రీడా శక్తిని, యువశక్తిని ఏకం చేసే ఒక మహా యజ్ఞం ఇది' అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. యువత దేశానికి వెన్నెముక అని పేర్కొన్నారు. దీనిలో 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రతి జిల్లాలోని రెండు కళాశాలల నుంచి యువత భాగస్వాములయ్యారు. క్రీడలను కేవలం ప్రతిభను వెలికితీయడానికే కాకుండా, యువజన నాయకత్వం, పౌర బాధ్యత, దేశ నిర్మాణంలో కీలక సాధనంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య లక్ష్యంతో పాటు 'వికసిత్ భారత్' దిశగా యువతను నడిపించేందుకు ఈ వేదిక దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో 'యువ సంవాద్' పేరుతో అత్యాధునిక వసతులు, కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్ ద్వారా దేశీయ క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు.

# అందిపుచ్చుకోని కమలం

(మొదటి పేజీ తరువాయి)
తెలంగాణ బీజేపీకి మరో ప్రధాన సమస్య నాయకత్వం. బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ ఆందోళనలు, నిరసనలతో కేడర్‌లో ఉత్సాహాన్ని పెంచింది. ప్రస్తుతం కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి కీలక నేతలు ఉన్నప్పటికీ.. పార్టీని రాష్ట్రవ్యాప్తంగా ఒకే దిశలో నడిపించే నాయకత్వంపై స్పష్టత కనిపించడం లేదనే చర్చ సాగుతోంది.నాయకుల మధ్య సమన్వయం లోపిస్తే కాంగ్రెస్‌పై, బీఆర్ఎస్‌పై బీజేపీ ఒకే స్వరంతో పోరాడటం కష్టమవుతుంది. ముఖ్యంగా సీఎం అభ్యర్థిత్వంపై ప్రజల్లో స్పష్టమైన అభిప్రాయం ఏర్పడేలా పనిచేయాల్సిన అవసరం ఉంది.



**బెంగాల్ తరహా పోరాటం అవసరమా?**
పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీ ఏ స్థాయిలో కేడర్‌ను నిర్మించిందో తెలంగాణలోనూ అలాంటి దీర్ఘకాలిక గ్రౌండ్ పాలిటిక్స్ అవసరమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేలా కార్యాచరణ ఉండాలి. ప్రెస్‌మీట్లు, ప్రకటనలు, ఢిల్లీ పర్యటనలకు మాత్రమే పరిమితం కాకుండా.. రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగం, ఉపాధి, మౌలిక వసతులు వంటి ప్రజల రోజువారీ సమస్యలపై బీజేపీ రోడ్డెక్కాల్సిన అవసరం ఉంది. ఇక బీఆర్ఎస్–బీజేపీ ఒక్కటేననే పాత ప్రచారం కూడా పార్టీకి సవాలుగా మారుతోంది. ఆ అనుమానాన్ని తొలగించేలా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు భిన్నమైన రాజకీయ వైఖరిని బీజేపీ క్షేత్రస్థాయిలో చూపించాల్సి ఉంటుంది.

**అవకాశాన్ని అందిపుచ్చుకోకపోతే?**
తెలంగాణలో బీజేపీకి ప్రస్తుతం రాజకీయంగా ఒక అవకాశం ఉన్న మాట వాస్తవమే. కానీ ఆ అవకాశాన్ని అధికార లక్ష్యంగా మలచుకోవాలంటే పార్టీ వ్యూహంలో సమూల మార్పులు అవసరం. గ్రూపు రాజకీయాలను పక్కనపెట్టి సమిష్టి నాయకత్వంతో ముందుకు సాగడం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడం, స్పష్టమైన సీఎం ఫేస్‌ను ప్రాజెక్ట్ చేయడం, అధికారంలోకి వస్తే అమలు చేసే విధానాలను ప్రజలకు వివరించడం కీలకం. ప్రస్తుతం ఉన్న పొలిటికల్ వాక్యూమ్‌ను బీజేపీ క్యాష్ చేసుకోగలదా? లేక మరోసారి ఆ అవకాశాన్ని ఇతర పార్టీలకు వదిలేస్తుందా? అనేది రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారనుంది.

# హరీష్ అరెస్ట్

**ముద్ర, వరంగల్ :**
హన్మకొండ కలెక్టరేట్ ప్రాంగణం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలపడంతో పాటు, ధర్నా నిర్వహిస్తున్న టీఎన్జీఓ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన హరీష్ రావు.. సుబేదారి పోలీస్ స్టేషన్ కు నడుచుకుంటూ వెళ్లారు.

**బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం**
హరీశ్ రావును అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు శాంతియుతంగా ప్రజా సమస్యలపై స్పందిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు బలగాలతో నిర్బంధాలకు పాల్పడుతోందని, గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. ఈ ఘర్షణతో హన్మకొండ కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.
వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం (జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ) ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా, టీఎన్జీఓలు కూడా ధర్నా నిర్వహించాయి. తొలుత హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు ఉదయాన్నే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే.. అన్ని ఆంక్షలను దాటుకుని హరీశ్ రావు హనుమకొండ కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. హరీశ్ రావు రాకతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్ట్ చేసి అక్కడి నుండి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# 288 మంది గల్లంతు

**ముద్ర నేషనల్ డెస్క్:**
నేపాల్ ఆకస్మిక వరదల్లో (Nepal Floods) 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగశాఖ ప్రకటించింది. ఇప్పటివరకు 21 మందిని కాపాడినట్లు తెలిపింది. వీరంతా తమిళనాడుకు చెందినవారని పేర్కొంది. మానస సరోవర యాత్రకు వెళ్లిన పలువురు భారత పౌరులు చైనా వైపు టిబెట్‌లో చిక్కుకుపోయినట్లు తెలిపింది. అక్కడి నుంచి సుమారు 200 మంది సాయం కోసం విజ్ఞప్తి చేశారని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో చెప్పారు. వరదల నేపథ్యంలో ఢిల్లీలో ప్రత్యేక కంట్రోల్ ఏర్పాటు చేశామన్నారు.
'ఆచూకీ తెలియకుండా పోయిన 288 మంది భారతీయుల్లో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది కూడా ఉన్నారు. తమిళనాడు నుంచి 37, 49 మందితో కూడిన రెండు పర్యాటక బృందాలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ నుంచి 32 మంది, కేరళ నుంచి 33 మంది, మిగతావారు వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. సహాయక చర్యల విషయంలో నేపాల్ అధికారులతో సంప్రదింపుల్లో ఉన్నాం. మానవతా సాయంతో కూడిన రెండు విమానాలను ఇప్పటికే కాఠ్‌మండూకు పంపాం. మొత్తం 47.5 టన్నుల అత్యవసర సామగ్రిని చేరవేశాం. బెయిలీ బ్రిడ్జిని పంపుతున్నాం' అని జయస్వాల్ వెల్లడించారు.

**270కి పెరిగిన మరణాలు..**
నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతి చెందినవారి సంఖ్య 270కు పెరిగింది. నేపాల్, టిబెట్‌లో కలిపి 1,600 మందికి పైగా గల్లంతయినట్లు సమాచారం. వీరిలో 500 మందికిపైగా విదేశీయులు ఉన్నారని నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది. బాధితుల్లో చాలా మంది ట్రెక్కింగ్ లేదా కైలాస మానస సరోవర యాత్ర కోసం వచ్చిన వారేనని తెలిపింది. నేపాల్ టూరిజం బోర్డు వివరాల ప్రకారం.. గల్లంతయిన వారిలో భారత్‌తోపాటు అమెరికా (65), ఉక్రెయిన్ (53), మలేషియా (51) సహా 30 దేశాలకుపైగా పౌరులు ఉన్నారు.

# కొండా సురేఖకు పవర్ కట్

(మొదటి పేజీ తరువాయి)
ఉందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే నేరుగా వేటు వేయకుండా.. ముందుగా ఆమెకు ఉన్న పరిపాలనా అధికారాలను క్రమంగా పరిమితం చేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**అధికార యంత్రాంగంపై పట్టు తగ్గించడమేనా?**
అటవీ శాఖలో అధికారుల డిప్యూటేషన్ల రద్దుతో సురేఖకు అనుకూలంగా ఉన్న అధికార యంత్రాంగం మారిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో శాఖాపరమైన నిర్ణయాల్లో మంత్రిగా ఆమె ప్రభావం తగ్గే అవకాశం ఉంది. అధికారులు మంత్రి ఆదేశాల కంటే సీఎంవో దిశానిర్దేశాలకే ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితి వస్తే.. అది రాజకీయంగా సురేఖను మరింత బలహీనపరిచే పరిణామమే అవుతుందనే చర్చ.

**సుమంత్ వ్యవహారంతో మరింత ఒత్తిడి**
మరోవైపు మాజీ ఓఎస్డీ సుమంత్ చుట్టూ పాత ఆరోపణలపై విచారణ వేగవంతం కావడం కూడా కొండా కుటుంబానికి ఇబ్బందికరంగా మారే అవకాశముంది. ఈ వ్యవహారంలో చట్టపరమైన చర్యలు ముందుకు సాగితే.. రాజకీయ అంశాల కంటే ఆరోపణలు, విచారణలే ప్రధాన చర్చగా మారే పరిస్థితి ఏర్పడవచ్చు. ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే.. సురేఖను ఒక్కసారిగా కేబినెట్ నుంచి తప్పించడం కంటే, ఆమె రాజకీయంగా మరియు పరిపాలనా పరంగా ఒంటరిగా మారేలా పరిస్థితులను సృష్టిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారం తగ్గడం, అనుకూల అధికారుల బదిలీలు, పాత ఆరోపణలపై విచారణలు.. ఇవన్నీ కలిపి చూస్తే ఆమెను రాజీకి తీసుకురావడమో, స్వయంగా వెనక్కి తగ్గేలా చేయడమో వ్యూహంగా ఉండొచ్చనే చర్చ సాగుతోంది. అయితే ఇవన్నీ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న విశ్లేషణలు మాత్రమే. ప్రభుత్వం ఉద్దేశం ఏమిటన్నది అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. అయినప్పటికీ కొండా సురేఖకు సంబంధించిన తాజా పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తాయా? లేక చివరకు సర్దుబాటుతో ముగుస్తాయా? అనేది ఆసక్తికరంగా మారింది.



## తెలంగాణలో వాటర్ స్పోర్ట్స్





**ముద్ర, హైదరాబాద్:**
మీరాలం చెరువు చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మీరాలం చెరువుపై సస్పెన్షన్ బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. భారీ క్రేన్ పైనుంచి మీరాలం చెరువు పనులను పరిశీలించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని, చెరువులోకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మీరాలం నుంచి మూసీలోకి వరద వెళ్లేలా నాలాను విస్తరించాలన్నారు. వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ ఏర్పాటు చేయాలని, మీరాలం చెరువులో ఉన్న ఐ ల్యాండ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఇక్కడికి పర్యాటకులను రప్పించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 28.08.2026
www.mudranews.in | @mudranews



## రాగులతో బరువు తగ్గేందుకు సహాయం

రాగులు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో తరచూ తినాలనే కోరిక తగ్గి, బరువు నియంత్రణలో సహాయ పడవచ్చు.



# తెలంగాణలో భారీగా ఆధునిక ధాన్య సైలోలు



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణకు అనుగుణంగా శాశ్వత, శాస్త్రీయ నిల్వ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో ఆధునిక ధాన్య సైలోలు నిర్మించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

పెరుగుతున్న ధాన్యం సేకరణ అవసరాలను సంప్రదాయ గోదాములతో మాత్రమే తీర్చడం సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, యాంత్రిక రవాణా, శాస్త్రీయ సంరక్షణ, డిజిటల్ మానిటరింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో కూడిన సైలో వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. తేమ, పురుగులు, ఇతర కారణాలతో ధాన్యం నష్టపోకుండా నిల్వ నుంచి తరలింపు వరకు ప్రతి దశలో నాణ్యత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

సైలోల నిర్మాణం, నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను (SHGs) పెద్ద ఎత్తున భాగస్వాములను చేసే అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాలకు ఆర్థిక సాధికారత కల్పించడంతో పాటు, రాష్ట్ర ఆహార భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల నిర్వహణలో వారికి భాగస్వామ్యం కల్పించే విధంగా కార్యాచరణ నమూనాలను రూపొందించాలని ఆదేశించారు.

ఇటీవల రబీ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరణకు సిద్ధమైంది. భారీగా పెరుగుతున్న సేకరణకు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న శాశ్వత నిల్వ సామర్థ్యానికి మధ్య అంతరాన్ని తగ్గించేందుకు కొత్త సైలోలు కీలకంగా మారనున్నాయి.

అదేవిధంగా డిఫాల్టర్ బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిలను వేగంగా వసూలు చేసేందుకు పటిష్టమైన న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ధాన్యం వేలం ప్రక్రియలో పారదర్శకత కోసం GeM, తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ వంటి ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

రైతుల కష్టార్జిత పంటకు భద్రత కల్పించడం, నిల్వ నష్టాలను తగ్గించడం, ప్రజాధనాన్ని కాపాడటం, పౌర సరఫరాల వ్యవస్థను ఆధునికీకరించడమే లక్ష్యంగా దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని సైలోల నిర్మాణం చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## దేవదుర్గ గనుల్లో బంగారం, రాగి అన్వేషణ

**ముద్ర, హైదరాబాద్ :** కర్ణాటకలోని రాయచూరు జిల్లా దేవదుర్గలో సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టిన బంగారం, రాగి ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. లింగదహళ్లి గ్రామంలోని ఖనిజ బ్లాక్  ను పరిశీలించిన ఆయన.. అన్వేషణ పనులను స్థానికుల సహకారంతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్వేషణ విజయవంతమై పెద్ద ఎత్తున బంగారం, రాగి లభిస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని భట్టి విక్రమార్క అన్నారు. పనుల పర్యవేక్షణకు సింగరేణి ఆధ్వర్యంలో సైట్ క్యాంప్ ఆఫీస్, రాకపోకల కోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. 136 ఏళ్ల మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి దేవదుర్గ బ్లాక్ అన్వేషణ హక్కులను కేంద్ర టెండర్ల ద్వారా దక్కించుకుందని ఆయన తెలిపారు.ఈ ప్రాజెక్టు ద్వారా రెండు రాష్ట్రాల అభివృద్ధితో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అనంతరం డిప్యూటీ సీఎం శ్రీ పరమానంద శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కుల శ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్

**ముద్ర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న వేళ బీఆర్ఎస్ నేతల విమర్శలకు మంత్రి వాకిటి శ్రీహరి గట్టి కౌంటర్ ఇచ్చారు. వెయ్యి రోజుల పాలనపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఇచ్చిన హామీలను అమలు చేయని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, పేదలు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందని చెప్పారు. రైతు రుణమాఫీతో పాటు ఉద్యోగ నియామకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆంధ్రా ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు ప్రెస్‌మీట్లు, ఆరోపణలు పక్కన పెట్టి తమ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో కూడా బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి వాకిటి శ్రీహరి ప్రశ్నించారు.

## తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై సెప్టెంబర్ 1న కీలక సమావేశం

**ముద్ర, హైదరాబాద్:** తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం (CWC) చైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. ప్రాజెక్టు ఎత్తును గతంలో అంగీకరించిన 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తక్కువ విద్యుత్ వ్యయంతో ప్రాణహిత జలాలను వినియోగించుకునేలా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రం, మహారాష్ట్రతో వరుసగా చర్చలు జరుపుతున్నారు.

## తెలంగాణకు చెందిన 22 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది

**- పొంగులేటి**



**ముద్ర, హైదరాబాద్:** నేపాల్ వరదల పరిస్థితులపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నేపాల్‌లో తెలంగాణకు చెందిన 23 మంది చిక్కుకున్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిలో ఆరుగురు రాష్ట్ర వాసులు కాగా, 17 మంది ప్రవాస తెలంగాణ వారని మంత్రి తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పర్యాటకుడు సురక్షితంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. మిగతా 22 మంది ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు మంత్రి చెప్పారు. చిక్కుకున్నవారి వివరాలు విదేశాంగశాఖకు పంపించినట్లు పేర్కొన్నారు. కేంద్రం, నేపాల్‌లోని రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ, హైదరాబాద్‌లో హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఢిల్లీలో హెల్ప్‌లైన్ నంబర్లు: 9871999044, 9949351270, 9618597969. సచివాలయంలో హెల్ప్‌లైన్ నంబర్లు: 9885371189, 7997959754, 9440854433

## ఏడీ జయరాజు నివాసాల్లో రూ.100 కోట్ల ఆస్తులు గుర్తింపు

**ముద్ర న్యూస్, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భగనుల శాఖ ఏడీ జయరాజు నివాసాల్లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాల్లో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే ఆస్తులు గుర్తించారు. దీంతో ఆయనను అరెస్టు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి, హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు సహా 12 ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఈరోజు సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో జయరాజుకు హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, కేపీహెచ్‌బీలో ఫ్లాట్, కీసర, సూర్యాపేట, తూప్రాన్, తుంగతుర్తిలో ప్లాట్లు, సూర్యాపేటలో 3.21 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు.జయరాజ్ నివాసాల్లో రూ.10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లల్లో భారీగా గృహోపకరణాలు, రూ.71 లక్షల బ్యాంకు నిల్వలు ఉన్నట్లు తేలింది. డ్రైవర్‌కు పలు దఫాలుగా రూ.24 లక్షలు బదిలీ చేసినట్లు గుర్తించారు. ఇసుక రవాణా మామూళ్లను ఏడీ జయరాజ్ తన ఖాతాకు బదిలీ చేసినట్లు డ్రైవర్ వెల్లడించాడు. ఆ డబ్బును జయరాజు కుమార్తెకు బదిలీ చేసినట్లు తెలిపాడు. ఇటీవల ఉత్తమ అధికారిగా జయరాజు అవార్డు అందుకోవడం గమనార్హం.

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ వాసులపై సీఎం సమీక్ష

**ముద్ర, అమరావతి**: నేపాల్‌లో వరదల్లో చిక్కుకున్న ఏపీ వాసుల పరిస్థితిపై సీఎం చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. రాష్ట్రానికి చెందిన 41 మంది అక్కడ చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 34 మంది సురక్షితంగా ఉండగా, ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉంది.గల్లంతైన వారి ఆచూకీ కోసం కేంద్ర ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సీఎం ఆదేశించారు. బాధితులను ప్రత్యామ్నాయ మార్గాల్లోనైనా సురక్షితంగా స్వస్థలాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

## రాఖీ పౌర్ణమికి తెలంగాణలో 5 వేల ప్రత్యేక బస్సులు

ముద్ర, హైదరాబాద్: రాఖీ పౌర్ణమి వేళ రద్దీ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## మణుగూరులో యువకుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి



**ముద్ర, మణుగూరు న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో శివకుమార్ అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శివకుమార్ హైదరాబాద్‌లో ఇంటీరియర్ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. అతని దగ్గర పని చేసే యువకుడికి, మరో యువకుడికి మధ్య వివాదం ఏర్పడింది. దీంతో శివకుమార్ జోక్యం చేసుకోవటంతో వివాదం పెరిగింది. చరవాణిలో శివకుమార్‌తో యువకులు గొడవపడి మణుగూరు రమ్మని సవాల్ విసిరారు. దీంతో గురువారం మణుగూరు వెళ్లిన శివ కుమార్‌ను ఆ యువకులు 30-40 మంది గ్యాంగ్‌తో వచ్చి స్థానిక స్టోర్ గ్రౌండ్‌లో తీవ్రంగా కొట్టారు. గాయపడిన శివకుమార్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

**– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ నగరం, ORR పరిధిలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ట్రాఫిక్ సిగ్నళ్ల ఆధునీకరణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అత్యవసర సేవలకు వేగవంతమైన మార్గాలు, ఫుట్‌పాత్ ఆక్రమణల నియంత్రణపై చర్చించారు.

ట్రాఫిక్ నిర్వహణ కోసం TG-TMARS పేరుతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, AI ఆధారిత ట్రాఫిక్ నియంత్రణ, ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను విస్తృతంగా వినియోగించాలని సీఎస్ సూచించారు. నవంబర్, డిసెంబర్ నాటికి అవసరమైన ప్రాంతాల్లో సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతకు సంబంధించిన శాఖలు సమన్వయంతో పనిచేసేలా ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ డేటా ప్లాట్‌ఫామ్ ఏర్పాటును పరిశీలించాలని సూచించారు.



ఈ సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్, రవాణా, రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిలో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలి

**ముద్ర, హైదరాబాద్:** ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరాల్లో పెరుగుతున్న కాలుష్యం, ఒత్తిడి నేపథ్యంలో హరిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.హైదరాబాద్ ఐమ్యాక్స్ థియేటర్ పక్కన హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 20వ గ్రాండ్ నర్సరీ మేళా–ఆల్ ఇండియా హార్టికల్చర్ & అగ్రికల్చర్ షోను మంత్రి గురువారం ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌ను పరిశీలించారు. 2015 నుంచి ప్రతి జనవరి, ఆగస్టులో నర్సరీ మేళా నిర్వహించడం అభినందనీయమని, ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించేందుకు ఇది మంచి వేదిక అని అన్నారు.ఆగస్టు 27 నుంచి 31 వరకు ఐదు రోజుల పాటు జరిగే మేళాలో 110కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన పూలు, మెడిసినల్ ప్లాంట్స్, బోన్సాయి, అలంకరణ మొక్కలు, కాక్టస్‌తో పాటు టెర్రస్, వెర్టికల్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయి. రూ.20 నుంచి రూ.2.5 లక్షల వరకు విలువైన మొక్కలతో పాటు ఆర్గానిక్ ఎరువులు, ఫెర్టిలైజర్లు, టెర్రకోట కుండీలు, ఇతర గార్డెనింగ్



సామగ్రి లభిస్తున్నాయి.

మొక్కలు ఇంటి అందాన్ని పెంచడమే కాకుండా ఆరోగ్యకరమైన, చల్లని వాతావరణాన్ని అందిస్తాయని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకం ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజలు మేళాను సందర్శించి మొక్కలను కొనుగోలు చేసి తమ ఇళ్లను పచ్చదనంతో నింపాలని కోరారు.

# జెన్ జీ యువత ప్రామాణికతను, క్రియాశీల భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నారు

**యువతను తక్కువ అంచనా వేయొద్దు**
**రాజకీయ నాయకులు ఇగోను వీడి, నిర్ణయాల్లో జెన్ జీ ని భాగస్వామ్యం చేయాలి**
**రాజకీయాలు, పరిపాలనలో జెన్ జీ ని భాగస్వామ్యం చేయడంపై మంత్రి నారా లోకేష్**

**ముద్ర, ముంబై:** సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువతను క్రియాశీల భాగ స్వాములుగా చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ రాజకీయ పార్టీలకు పిలుపు నిచ్చారు.  ముంబైలో జరిగిన ఫార్ప్యూన్ ఇండియా 40 అండర్ 40 అవార్డుల కార్యక్రమంలో లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రాజకీయాలు, పాలనలో జెన్ జీ యువతను భాగస్వామ్యం చేయడం ప్రాముఖ్యత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. యువతరంతో తన అనుభవాన్ని పంచుకుంటూ , తాను నేర్చుకున్న అతి పెద్ద పాఠం చాలా సులభమైనదని అన్నారు. వారిని తక్కువ చేసి మాట్లాడవద్దు. వారిని మొత్తం అభివృద్ధి ప్రయాణంలో భాగం చేయాలని అన్నారు.

జెన్ జీ, యువతతో తన అనుబంధం రాజకీయాలపై ప్రస్తుత ఉద్యమానికి చాలా ముందే ప్రారంభమైందని



మంత్రి లోకేష్ అన్నారు. మా ముఖ్యమంత్రి గారు, ఒక మంత్రిగా నేను వారిని పలుమార్లు కలిశాము. మేము ఒక నియోజకవర్గానికి వెళ్ళినప్పుడు, అక్కడ ఉన్న ఇన్ఫ్లుయెన్సర్లందరినీ కలుస్తూ ఉంటాం. మేము ఇంకా బాగా ఎలా చేయగలమని మీరు అనుకుంటున్నారు? ఈ నియోజకవర్గంలో మనం భిన్నంగా ఏమి చేయగలమని మీరు భావిస్తున్నారు? అని వారిని అడుగుతామని తెలిపారు.

ఇటువంటి సంభాషణల నుండి అద్భుతమైన ఆలోచనలు వస్తాయని, ముఖ్యంగా వారి సూచనలను అనుసరించడానికి తమవద్ద ఒక వ్యవస్థ ఉందని లోకేష్ తెలిపారు. మీకు ఎంతో అద్భుతమైన ఆలోచనలు వస్తాయి, వాటిని మేము ఫాలో-అప్ చేసే విధానం ఉంది. కాబట్టి వారిని సంభాషణలో భాగం చేయండి, అదే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను" అని లోకేష్ అన్నారు.

కొత్త తరం అంచనాలకు అనుగుణంగా రాజకీయ నాయకులు మారాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, రాజకీయ నాయకులు తమ ఇగోలను వీడి ప్రామా ణికతను అలవర్చుకోవడం చాలా ముఖ్యమని లోకేష్ అన్నారు. రాజకీయ నాయకులుగా మనం మన బ్యారియర్స్ ను వదిలేయడం ముఖ్యమని నేను భావిస్తున్నాను. ఈ రోజుల్లో యువత మీతో చాలా భావోద్వేగ స్థాయిలో కలవడానికి సిద్ధంగా ఉన్నారు, వారు మీ నుండి ప్రామాణికతను ఆశిస్తున్నారు" అని ఆయన అన్నారు. ప్రామాణికత, పారదర్శకత భారతదేశంలో తదుపరి తరం రాజకీయ నాయకులకు నిర్వచించే లక్షణాలుగా ఉంటాయని ఆయన అన్నారు. భారతదేశంలో తదుపరి తరం రాజకీయ నాయకుల నుండి వారు ఆశిస్తున్నది అదేనని నేను నమ్ముతున్నానని లోకేష్ పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శుక్రవారం 28.08.2026

4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## జీవితం ఒక పెద్ద పాఠశాల

మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా... ప్రతి అనుభవాన్ని మనకు పరిచయం చేస్తుంది. ప్రతి సంఘటన ద్వారా ఏదో ఒక పాఠాన్ని నేర్పిస్తుంది.

**సమయం:** ఏ పనీ లేని ఖాళీ రోజులను చూపిస్తుంది... శ్వాస తీసుకునేంత తీరిక కూడా లేని రోజులను చూపిస్తుంది.

**రాత్రి:** ప్రశాంతంగా నిద్రపట్టని రాత్రులను చూపిస్తుంది.. బాధ్యతల భారంతో నిద్రే రాని



రాత్రులను కూడా పరిచయం చేస్తుంది.

**ఫలితం:** కుంగదీసే ఓటమిని రుచి చూపిస్తుంది.. ఎగిరి గంతేసే విజయాన్నీ అందిస్తుంది.

**డబ్బు:** నెత్తిన పెట్టుకునే అభిమానాన్ని చూపిస్తుంది.. డబ్బు లేని సమయంలో మన విలువను తగ్గించే పరిస్థితులనూ చూపిస్తుంది.

**బంధాలు:** కన్నీళ్లు తుడిచే ఆప్యాయతను ఇస్తాయి.. కన్నీళ్లు మిగిల్చే బంధువులను కూడా పరిచయం చేస్తాయి.

**అధికారం:** గౌరవంతో దండాలు పెట్టించుకునే స్థాయిని చూపిస్తుంది.. అదే అధికారం పోయినప్పుడు ఎవరికీ చెప్పుకోలేని దీనస్థితినీ చూపిస్తుంది.

**ఆరోగ్యం:** మనతో ఉన్నప్పుడు దాని విలువ తెలియదు.. చిన్న అనారోగ్యం వచ్చినప్పుడు ఆరోగ్యం ఎంత గొప్ప సంపదో అర్థమవుతుంది.

**మనుషులు:** కొందరు మన జీవితంలోకి వచ్చి మనకు ఆనందాన్ని ఇస్తారు.. మరికొందరు వచ్చి మనకు జీవిత పాఠాలను నేర్పి వెళ్లిపోతారు.

**కాలం:** మనకు నచ్చిన వారిని దగ్గర చేస్తుంది.. నచ్చని పరిస్థితులను దూరం చేస్తుంది. చివరికి ఏదీ శాశ్వతం కాదని అర్థమయ్యేలా చేస్తుంది.

### చివరి మాట

ఇవన్నీ నీ జీవితంలోకి వస్తూ పోతుంటాయి. కొన్ని నిన్ను నవ్విస్తాయి.. కొన్ని ఏడిపిస్తాయి.. కొన్ని గెలిపిస్తాయి.. మరికొన్ని నిన్ను బలంగా మారుస్తాయి.

### వచ్చిన ప్రతి పరిస్థితినీ స్వీకరించు

నచ్చినప్పుడు ఆనందించు.. నచ్చనప్పుడు నేర్చుకో.
ఓటమిలో కుంగిపోకు.. విజయంతో పొంగిపోకు.
ఎవరైనా తోడుంటే సంతోషించు.. ఎవరూ లేకపోయినా ధైర్యంగా నడువు.

### ఎందుకంటే..

జీవితం అంటే కేవలం సుఖం కాదు..
కేవలం దుఃఖం కూడా కాదు..
సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తూ,
ప్రతి పరిస్థితినీ ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగడమే —— నిజమైన జీవితం




## రాఖీ ముడి వీడుతోందా!



98487 72232
గడగోజు రవీంద్రాచారి
జర్నలిస్ట్

రాఖీ అంటే.. రక్షణకు ముడివేసే పవిత్రమైన పేగుబంధం. సోదరి చేతి నుంచి సోదరుడి మణికట్టుకు చేరే ఆ చిన్న నూలుపోగు వెనుక కొండంత మమకారం దాగి ఉంటుంది. సోదరుడి ఆయురారోగ్యాలను, క్షేమాన్ని కోరుతూ ఆమె కట్టే రాఖీ.. కష్టకాలంలో 'నేనున్నాను' అంటూ సోదరుడు ఇచ్చే అభయహస్తానికి ప్రతీక. శ్రావణ పౌర్ణమి వేళ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు అద్దంపట్టే ఈ అపురూప వేడుక వెనుక ఎన్నో కథలు.. తరతరాలుగా గుండెల్లో భద్రపరచుకున్న మరెన్నో తీపి జ్ఞాపకాలు ఉన్నాయి.

ఒకప్పుడు రక్షాబంధన్ అంటేనే కుటుంబంలో ఓ ఆత్మీయ పండుగ. పుట్టింటికి వచ్చే ఆడపడుచు.. అన్న మణికట్టుకు రాఖీ కట్టి, నుదుట తిలకం దిద్ది, మిఠాయి తినిపించేది. అన్న తనకు తోచిన కానుక ఇచ్చేవాడు. ఆ కానుక విలువ ఎంత అన్నది ఎవరికీ పట్టేది కాదు. ఆ చిన్న దారంలో దాగిన ప్రేమే పెద్ద సంపద. బాల్యంలో కలిసి ఆడుకున్న జ్ఞాపకాలు, చిన్నచిన్న గొడవలు, మళ్లీ కలిసిపోయిన క్షణాలు.. పండుగ రోజున మరోసారి మనసును పలకరించేవి. కష్టమొస్తే తోబుట్టువులు ఒకరి కోసం మరొకరు నిలబడేవారు. 'నీకు నేనున్నాను' అనే మాటే బంధానికి భరోసా.

రాఖీ విలువ రాఖీలో లేదు.. బహుమతిలో అంతకంటే లేదు. చేతికి కట్టిన దారం ఎంత ఖరీదైనదో కాదు.. జీవితాంతం తోడుగా ఉంటాననే మాట ఎంత నిజమైనదో అదే అసలు విలువ. దారం తెగిపోవచ్చు. రంగు వెలిసిపోవచ్చు. ఇచ్చిన బహుమతి పోవచ్చు. కాలంతో వస్తువులు మారిపోవచ్చు. కానీ అన్నాచెల్లెళ్ల మధ్య నమ్మకం, ఆప్యాయత, ఆపదలో అండగా నిలిచే మనసు మాత్రం జీవితాంతం నిలవాలి. అదే రక్షాబంధన్ నిజమైన నిర్వచనం. అదే రాఖీ స్ఫూర్తి.

అమ్మ కడుపులో రక్తం పంచుకుని పుట్టిన వారు.. ఒకే ఇంటి గుమ్మంలో పెరిగిన వారు.. ఒకే తల్లిదండ్రుల ప్రేమను పంచుకున్నవారు.. పెద్దయ్యాక పగలు, ప్రతీకారాలతో ఎందుకు విడిపోవాలి? బాల్యంలో ఒకరి కన్నీటికి మరొకరు కారణం అడగకుండా స్పందించిన తోబుట్టువులు.. ఆస్తి విషయంలో మాత్రం ఒకరి కన్నీటికి మరొకరు కారణమవుతున్న దుస్థితి ఎందుకు? ఈ ప్రశ్న రక్షాబంధన్ రోజున ప్రతి కుటుంబం ముందుంచుకోవాల్సిన ప్రశ్న.



కాలం మారింది. ఉమ్మడి కుటుంబాలు తగ్గాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు, వలసలతో కుటుంబాలు దూరమయ్యాయి. సాంకేతికత మనుషులను క్షణాల్లో పలకరించే అవకాశం ఇచ్చింది. అయినా మనసుల మధ్య దూరం మాత్రం పెరుగుతోంది. ఒకప్పుడు పండుగ అంటే అందరూ ఒకచోట చేరేవారు. ఇప్పుడు 'హ్యాపీ రక్షాబంధన్' అనే సందేశంతోనే పండుగ ముగిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చేతిలో ఫోన్ ఉంది.. కానీ తోబుట్టువుతో మాట్లాడేందుకు మనసు లేదు. సామాజిక మాధ్యమాల్లో బంధాల ప్రదర్శన ఉంది.. కానీ జీవితంలో వాటికి సమయం కరవవుతోంది.

ఇదికాక ఆస్తిపాస్తులు రక్తబంధాలకు పెద్ద పరీక్షగా మారుతున్నాయి. తల్లిదండ్రులు జీవితాంతం చెమటోడ్చి సంపాదించిన ఇల్లు, పొలం, స్థలం, నగదు.. పిల్లలకు భద్రత కల్పించాల్సింది పోయి వారి మధ్య చిచ్చుకు కారణమవుతున్నాయి. 'నాకు ఎంత? నీకు ఎంత?' అనే లెక్కలు మొదలైన చోట 'మనది' అనే భావన వెనక్కి వెళ్తోంది. చిన్న అనుమానం మాటపట్టింపుగా మారుతోంది. మాటపట్టింపు పంతంగా మారుతోంది. పంతం పంచాయతీకి దారితీస్తోంది. చివరకు పోలీస్‌స్టేషన్, న్యాయస్థానాల గడపలు తొక్కాల్సిన పరిస్థితి వస్తోంది. ఒకే తల్లి గర్భాన్ని పంచుకున్నవారు.. ఆస్తి పత్రాల్లో ప్రత్యర్థులుగా నిలబడటం కన్నా విషాదం ఏముంది.

ఆస్తిపై న్యాయమైన హక్కు కోరడం తప్పు కాదు. కానీ హక్కు కోసం బంధాన్ని కోల్పోవడమే అసలు విషాదం. భూమికి హద్దులు ఉంటాయి.. బంధానికి ఎందుకు? ఇంటికి వాటాలు ఉంటాయి.. తల్లిదండ్రుల ప్రేమకు వాటాలుంటాయా? పత్రంలో పేరు మారవచ్చు.. కానీ చిన్ననాటి జ్ఞాపకాల్లోని మనిషి పేరు చెరిపేయగలమా? ఆస్తి కోసం కోర్టులో గెలిచినా.. మనిషిని కోల్పోతే ఆ విజయం దేనికి?

స్వార్థం ఆస్తుల దగ్గరే ఆగడం లేదు. తోబుట్టువుల ఎదుగుదల పట్ల ఈర్ష్య, పోలికలు, అహంకారం కూడా బంధాలను బలహీనపరుస్తున్నాయి. అన్న బాగుపడితే సంతోషించాల్సింది పోయి 'నాకంటే ఎందుకు ఎక్కువ?' అనే ఆలోచన. తమ్ముడు ఎదిగితే గర్వపడాల్సింది పోయి అసూయ. చెల్లి ఉన్నత స్థాయికి చేరితే అభినందించాల్సింది పోయి పోలిక. సొంతవారి విజయాన్ని కూడా పోటీగా చూడటం మొదలైతే.. రక్తబంధం క్రమంగా ఆర్థిక సంబంధంగా మారిపోతుంది.

ఇంకో వైపు వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత విషయంలో కుటుంబ విలువల అసలు రూపం బయటపడుతోంది. ఆస్తి పంచుకునేటప్పుడు వాటా కోసం ముందుండేవారు.. తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత వచ్చినప్పుడు 'నువ్వు చూసుకో' అంటూ వెనక్కి తగ్గడం జరుగుతోంది. జీవితమంతా పిల్లల కోసం బతికిన తల్లిదండ్రులు.. చివరికి పిల్లల మధ్యే తమకు చోటు కోసం ఎదురుచూడాల్సి రావడం కంటే కన్నీటి దృశ్యం మరొకటి ఉండదు. తల్లిదండ్రుల కళ్లలోని ఆ కన్నీరు.. ఏ ఆస్తి విలువకన్నా గొప్పది. వారిని గౌరవించని బంధానికి రాఖీ కట్టుకున్నా.. దాని పరమార్థం ఏమిటి?

రక్తబంధాలు బలహీనపడటం అంటే కేవలం ఇద్దరు వ్యక్తులు దూరం కావడం కాదు. కుటుంబ వ్యవస్థలో ఓ పునాది కదలడం. పిల్లలు పెద్దలను చూసి నేర్చుకుంటారు. తల్లిదండ్రులు తోబుట్టువులతో పగ పెంచుకుంటే.. పిల్లలకు బంధం కూడా లాభనష్టాల వ్యవహారంగానే కనిపిస్తుంది. రేపటి తరానికి ఆస్తులు ఉండొచ్చు.. కానీ ఆపదలో అండగా నిలిచే మనుషులు లేకపోవచ్చు. ఇళ్లు పెద్దవవుతాయి.. గదులు పెరుగుతాయి.. సౌకర్యాలు పెరుగుతాయి.. కానీ మనసుల్లో ఒంటరితనం పెరిగితే ఆ అభివృద్ధి అసంపూర్ణమే.

అందుకే రక్షాబంధన్ ఒకరోజు పండుగగా మిగలకూడదు. ఇది ఆత్మపరిశీలనకు ఒక సందర్భం కావాలి. ఏళ్లుగా మాట్లాడుకోని అన్నాచెల్లెళ్లు ఉంటే.. ఈ రోజున ఒక అడుగు ముందుకు వేయాలి. అపార్థాలు ఉంటే తొలగించుకోవాలి. పంతాలు ఉంటే పక్కన పెట్టాలి. ఆస్తి వివాదాలుంటే న్యాయబద్ధంగా పరిష్కరించుకోవాలి. కానీ ఆస్తి కోసం అనుబంధాన్ని తాకట్టు పెట్టకూడదు. తల్లిదండ్రుల బాధ్యతను పంచుకోవాలి. ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా అభినందించాలి. కష్టంలో ఉన్నప్పుడు 'నీకు నేనున్నాను' అని చెప్పాలి.

రక్షణ అంటే కేవలం ప్రమాదం నుంచి కాపాడటం కాదు. సోదరి చదువుకు అండగా నిలవడం.. ఆమె ఉద్యోగాన్ని గౌరవించడం.. ఆమె నిర్ణయాలకు విలువ ఇవ్వడం.. ఆమె ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా రక్షణే. అలాగే సోదరుడి కష్టంలో చెల్లి తోడుగా ఉండటం.. కుటుంబంలో చీలిక వచ్చినప్పుడు మరింత దూరం పెంచకుండా కలిపే ప్రయత్నం చేయడం కూడా బంధధర్మమే.

చేతులు లేకపోయినా అన్నకు రాఖీ కట్టాలన్న ఓ చిన్నారి తపన మనకు ప్రేమకు పరిమితులు లేవని చెబుతోంది. రాఖీ కట్టేందుకు చేతులు అవసరం లేదు.. హృదయం ఉంటే చాలు. మరి చేతులున్న మనం.. మనసుల మధ్య పెరిగిన దూరాన్ని తగ్గించుకోలేమా? ఒక చిన్నారి తన ప్రేమతో అడ్డంకిని జయించగలిగితే.. మన స్వార్థాన్ని మనమే జయించలేమా?

రక్షాబంధన్ మనకు ఇచ్చే సందేశం సూటిగా ఉంది. బహుమతి ఎంత ఖరీదైనదో కాదు.. బంధం ఎంత విలువైనదో ముఖ్యం. రాఖీ ఎంత అందంగా ఉందో కాదు.. ఆ రాఖీ కట్టిన చేతిని జీవితాంతం గౌరవించగలమా అన్నదే ముఖ్యం. దారం తెగవచ్చు.. బహుమతులు పోవచ్చు.. కాలం అన్నింటినీ మార్చవచ్చు. కానీ 'కష్టంలో నేనున్నాను' అనే మాట మాత్రం చివరి శ్వాస వరకు నిలవాలి.

ఆస్తులు ఉంటాయి.. పోతాయి. డబ్బు వస్తుంది.. వెళ్తుంది. హోదాలు మారతాయి. కానీ అమ్మ కడుపులో రక్తం పంచుకుని పుట్టిన బంధం మాత్రం జీవితంలో ఒక్కసారే లభిస్తుంది. దాన్ని కోల్పోయాక తిరిగి కొనలేం. పగతో గెలిచేది ఏమీ లేదు. ప్రతీకారంతో నిలిచేది ఏ బంధమూ కాదు. చివరి శ్వాస వరకు ఒకరికొకరు తోడుగా ఉండటమే రక్తబంధానికి నిజమైన గౌరవం.

ఈ రక్షాబంధన్ వేళ మనకు మనమే ఓ మాట ఇచ్చుకుందాం. ఆస్తుల కోసం అన్నను కోల్పోకూడదు.. పంతం కోసం చెల్లిని దూరం చేసుకోకూడదు.. అనుమానం కోసం అక్కతో బంధం తెంచుకోకూడదు. తల్లిదండ్రుల కళ్లలో కన్నీరు రానివ్వకూడదు. తోబుట్టువుకు కష్టం వస్తే ముందుగా పలకరించే మనిషిగా ఉండాలి.

రాఖీ మణికట్టుకు కట్టే దారంతో మొదలవుతుంది.. కానీ దాని అసలు ప్రయాణం హృదయంలో మొదలవుతుంది. చేతికి కట్టిన దారం తెగిపోయినా పర్వాలేదు.. మనసులకు కట్టిన బంధం మాత్రం తెగకూడదు. రాఖీ కట్టడం ఆచారం.. రక్షించడం బాధ్యత.. జీవితాంతం తోడుగా నిలవడమే రక్షాబంధన్ అసలైన పరమార్థం.

రక్తం పంచుకున్న బంధాలను స్వార్థం విడదీయకూడదు. రాఖీ ముడి మన మణికట్టుపైనే కాదు.. మన మనసుల పైనా పడాలి. అప్పుడే ఈ పండుగకు నిజమైన అర్థం.. రక్తబంధాలకు నిజమైన రక్ష.

## రాఖీ కట్టేటప్పుడు పఠించే మంత్రం

శ్రావణ పూర్ణిమను రాఖీ పూర్ణిమ లేదా రక్షాబంధనంగా జరుపుకొంటారు. సోదరీ సోదరుల మధ్య అనుబంధానికి ప్రతీక రాఖీ లేదా రక్షాబంధన్. ఈ ఏడాది ఆగస్టు 28న చేసుకొనే ఈ పండుగ (Raksha bandhan 2026) కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, జీవితాంతం ఒకరికొకరు అండగా ఉంటామని చేసుకునే దివ్య ప్రతిజ్ఞ. సోదరి తన సోదరుని చేతికి రక్షాసూత్రాన్ని కట్టి అతని ఆయురారోగ్యాలు, విజయాలు, క్షేమాన్ని కోరుతుంది. సోదరుడు ఆమెకు ప్రేమ, ఆదరణ, రక్షణ అందిస్తానని సంకల్పిస్తాడు. రక్షాబంధనం కేవలం సోదర–సోదరీ సంబంధానికి మాత్రమే పరిమితం కాదు. పరస్పర విశ్వాసం, ప్రేమ, బాధ్యత, ధర్మరక్షణ అనే విశాలమైన భావాలకు రక్షాసూత్రం ప్రతీకగా నిలుస్తుంది. రక్షాసూత్రం కట్టేటప్పుడు పఠించే మంత్రం ఇదే..

యేన బద్ధో బలీ రాజా
దానవేంద్రో మహాబలః|
తేన త్వాం ప్రతిబధ్నామి
రక్షే మా చల మా చల||

మంత్ర భావం: ఏ రక్షాసూత్రంతో మహాబలవంతుడైన దానవేంద్రుడు బలిచక్రవర్తి బంధింపబడ్డాడో, అదే రక్షాసూత్రంతో నిన్ను బంధిస్తున్నాను. ఓ రక్షా! నీవు స్థిరంగా ఉండి, నిన్ను ధరించిన వ్యక్తిని ఎల్లప్పుడూ రక్షించు. ఈ మంత్రాన్ని పఠిస్తూ రక్షాసూత్రాన్ని కట్టడం వల్ల అది కేవలం అలంకార దారంగా కాకుండా, దైవ సంకల్పం, పరస్పర రక్షణ, ధర్మబద్ధమైన అనుబంధానికి ప్రతీకగా మారుతుంది.

## పాతాళలోకం నుంచి ప్రారంభమైన రక్షా బంధనం

రక్షాబంధనం ఒక ప్రాచీన భారతీయ పండుగ. ఈ పండుగ ప్రారంభం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. అయితే, ఈ రోజు మేము మీకు చెప్పబోయే కథను ఈ పండుగకు సంబంధించిన అత్యంత పురాతన కథగా భావిస్తారు. అన్నయ్య చేతికి రాఖీ కట్టే సంప్రదాయం ఈ కథ నుంచే ప్రారంభమైందని చెబుతారు.

ఈ రోజు మన ప్రత్యేక కథనంలో మీ ఈ ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం తెలుసుకుందాం. రాఖీ సంప్రదాయం భూమిపై కాకుండా పాతాళ లోకం నుంచి ప్రారంభమైందని మీకు తెలుసా? పురాణ విశ్వాసాల ప్రకారం, రక్షాబంధనం పండుగను స్వయంగా మాతా లక్ష్మీదేవి ప్రారంభించారు. ఒక ప్రత్యేకమైన వాగ్దానం కారణంగా ఆమె రాజా బలిచక్రవర్తి చేతికి తొలి రాఖీని కట్టారు. రాఖీకి సంబంధించిన అత్యంత పురాతనమైన కథను తెలుసుకుందాం.

### రాఖీకి సంబంధించిన కథ

శ్రీమద్భాగవత పురాణం ప్రకారం, అసురరాజు బలిచక్రవర్తి ఎంతో పరాక్రమశాలి, దానశీలుడైన రాజు. తన తపోబలం, పరాక్రమంతో ఆయన మూడు లోకాలపై తన ఆధిపత్యాన్ని స్థాపించాడు. దీంతో భయపడిన దేవేంద్రుడు శ్రీమహావిష్ణువును శరణు కోరాడు.

అప్పుడు దేవతల రక్షణ కోసం శ్రీమహావిష్ణువు వామన అవతారం ధరించి రాజా బలి నిర్వహిస్తున్న యజ్ఞానికి వెళ్లారు. యజ్ఞానికి వచ్చిన వామనదేవుడిని చూసిన బలిచక్రవర్తి, తనకు కావాల్సిన దానాన్ని కోరుకోమని చెప్పాడు. అందుకు వామనదేవుడు కేవలం మూడు అడుగుల భూమి దానంగా ఇవ్వమని కోరాడు.

రాజా బలి ఆ మూడు అడుగుల భూమిని ఇవ్వడానికి అంగీకరించగానే, వామనదేవుడు తన విశ్వరూపాన్ని ధరించాడు. రెండు అడుగులతోనే భూమి, ఆకాశం,స్వర్గలోకాలను కొలిచాడు. మూడో అడుగు పెట్టడానికి స్థలం ఏదీ మిగలలేదు. అప్పుడు రాజా బలి తన తలను వామనదేవుడి పాదాల వద్ద ఉంచాడు.

బలిచక్రవర్తి భక్తికి, దానశీలతకు ప్రసన్నమైన శ్రీమహావిష్ణువు ఆయనను పాతాళ లోకానికి రాజుగా నియమించారు. అంతేకాక, ఏదైనా వరం కోరుకోమని బలిని కోరారు. అప్పుడు రాజా బలి ఒక అత్యంత ప్రత్యేకమైన వాగ్దానాన్ని కోరాడు.

'ప్రభూ! నేను ఉదయం నిద్రలేచినప్పుడు గానీ, రాత్రి నిద్రపోయేటప్పుడు గానీ మీరు ఎల్లప్పుడూ నా ఎదుటే ఉండేలా నాకు వరం ప్రసాదించండి. మీరు నా పాతాళ లోకానికి ద్వారపాలకుడిగా ఉండాలని నా కోరిక."

రాజా బలి కోరిన వరాన్ని శ్రీమహావిష్ణువు అంగీకరించారు. ఆ తరువాత శ్రీమహావిష్ణువు వైకుంఠధామాన్ని విడిచిపెట్టి పాతాళ లోకంలో రాజా బలికి ద్వారపాలకుడిగా నివసించసాగారు.

### విష్ణువును తిరిగి తీసుకురావడానికి మాతా లక్ష్మి కట్టిన తొలి రాఖీ

శ్రీమహావిష్ణువు వైకుంఠధామాన్ని విడిచిపెట్టడంతో మాతా లక్ష్మీదేవి ఎంతో దుఃఖించసాగారు. అప్పుడు తన స్వామిని తిరిగి తీసుకురావడానికి ఒక ప్రణాళిక రచించారు. ఆ ప్రణాళికలో భాగంగా మాతా లక్ష్మీదేవి ఒక సాధారణ స్త్రీ రూపాన్ని ధరించి పాతాళ లోకానికి వెళ్లారు. ఆమె రాజా బలిని తన సోదరుడిగా భావించి, శ్రావణ పౌర్ణమి రోజున రాజా బలి మణికట్టుకు రక్షాసూత్రాన్ని కట్టారు. అలాగే రాజా బలి దీర్ఘాయుష్షుతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.

ఇది చూసిన రాజా బలి హృదయం ప్రేమ, వాత్సల్యంతో నిండిపోయింది. తన ధర్మసోదరి తనను ఏదైనా కోరుకోవాలని ఆయన చెప్పాడు. అప్పుడు మాతా లక్ష్మీదేవి తన నిజ స్వరూపంలో ప్రత్యక్షమై ఇలా అన్నారు. "రాజా! నాకు ధనం, సంపద ఏమీ అవ సరం లేదు. నా స్వామిని నాకు తిరిగి అప్పగించండి."

మాతా లక్ష్మీదేవి తన చేతికి కట్టిన పవిత్రమైన రక్షాసూత్రానికి రాజా బలి ఎంతో గౌరవం ఇచ్చాడు. వెంటనే తాను శ్రీమహావిష్ణువును తన ద్వారపాలకుడిగా ఉండమని కోరిన ఆ ప్రత్యేకమైన వాగ్దానం నుంచి ఆయనను విముక్తి చేశాడు. ఆ తరువాత మాతా లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువును వెంటబెట్టుకుని తిరిగి వైకుంఠధామానికి చేరుకున్నారు.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శుక్రవారం 28.08.2026
www.mudranews.in | @mudranews



## రాగులతో రక్తహీనతకు ఉపయోగకరం



రాగుల్లో ఐరన్‌తో పాటు ఇతర సూక్ష్మపోషకాలు కూడా ఉంటాయి. సమతుల ఆహారంలో భాగంగా రాగులను తీసుకోవడం శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో సహాయపడుతుంది.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**నో మ్యాపింగ్, ఏఎస్డీ, ఓటర్ల వివరాల సవరణపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :** జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, ఏఎస్డీ కేటగిరీలకు సంబంధించిన ఓటర్ల వివరాలను నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా గురువారం నిర్వహించిన గ్రామ/వార్డు సభల్లో భాగంగా జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మున్సిపల్ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే సమయంలో అర్హత లేని నమోదులను నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ముఖ్యంగా నో మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న ఓటర్లకు సరైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. 2002 ఓటర్ల జాబితాతో వివరాలు సరిపోలకపోవడం లేదా అవసరమైన వివరాలు సమర్పించ లేకపోవడం వంటి కారణాలతో నో మ్యాపింగ్ కేటగిరీలోకి వచ్చిన అర్హులైన ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలినో మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న ఓటర్లు తమ అర్హతను నిరూపించేందుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతించిన ధ్రువపత్రాలను సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు జారీ చేసిన గుర్తింపు లేదా ధృవీకరణ పత్రాలు, ఉద్యోగి/పెన్షన్ గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్, శాశ్వత నివాస ధృవీకరణ పత్రం, భూమి లేదా ఇంటి కేటాయింపు పత్రాలు, పట్టాదారు పాస్‌బుక్ తదితర అనుమతించిన పత్రాలను అవసరాన్ని బట్టి సమర్పించవచ్చని వివరించారు. సమర్పించే ప్రతి పత్రం స్పష్టంగా ఉండటంతో పాటు సంబంధిత వ్యక్తికి చెందినదై ఉండాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా ఏదైనా పత్రాన్ని అప్‌లోడ్ చేయకుండా, నిబంధనలకు అనుగుణమైన సరైన ధ్రువపత్రాలను మాత్రమే సమర్పించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే వివరాలు సాఫ్ట్‌వేర్ ఆధారంగా పరిశీలించబడుతున్నందున పత్రాల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**

అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చూడటమే ఎన్నికల ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే సమయంలో అర్హత లేని, మరణించిన, డూప్లికేట్ లేదా వాస్తవంగా ఆ ప్రాంతంలో నివసించని ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిచేయాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి కారణం లేకుండా అర్హత ఉన్న ఓటరు పేరు తొలగించబడదని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని తెలిపారు. ప్రతి అభ్యర్థనను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఫారం-6, ఫారం-7, ఫారం-8 వినియోగంపై అవగాహన కల్పించాలి**

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన వ్యక్తులు ఫారం–6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అర్హత పొందిన వారు కూడా నిబంధనల ప్రకారం ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో ఉన్న పేరును తొలగించాల్సిన పరిస్థితి ఉంటే ఫారం–7 ద్వారా అభ్యంతరం/తొలగింపు కోసం దరఖాస్తు చేయాలని సూచించారు. ముఖ్యంగా మరణించిన వ్యక్తుల పేర్లు లేదా ఒకే వ్యక్తికి సంబంధించిన డూప్లికేట్ నమోదులు గుర్తించినప్పుడు నిబంధనల ప్రకారం ఫారం–7 ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. పేరు, తండ్రి/భర్త పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే ఫారం–8 ద్వారా సవరణకు దరఖాస్తు చేయాలని స్పష్టం చేశారు. బీఎల్ఓలు స్వయంగా ఓటరు వివరాలను మార్చకుండా, సంబంధిత ఫారం ద్వారా వచ్చిన అభ్యర్థన ఆధారంగానే నిబంధనల ప్రకారం సవరణలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

**పోలింగ్ స్టేషన్/ప్రాంత మార్పులకు సరైన ఫారం వినియోగించాలి**

ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు వేర్వేరు పోలింగ్ స్టేషన్లకు మ్యాప్ అయి ఉన్నా, లేదా ఓటరు వాస్తవంగా నివసిస్తున్న ప్రాంతానికి కాకుండా వేరే పోలింగ్ స్టేషన్‌కు కేటాయించబడి ఉన్నా, సంబంధిత మార్పును నిర్దేశిత ఫారం ద్వారా మాత్రమే చేయాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లకు ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున, ఈ సదుపాయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**2002 ఓటర్ల జాబితా వివరాలను పరిశీలించుకోవాలి**

నో మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న వ్యక్తులు ముందుగా 2002 ఓటర్ల జాబితాలో తమ పేరు లేదా కుటుంబ సభ్యుల వివరాలు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. 2002లో తాము ఓటరుగా లేకపోతే, నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు లేదా సంబంధిత కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను అందుబాటులో ఉన్న చోట సమర్పించాలని తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారా కూడా సంబంధిత అధికారిక ఆన్‌లైన్ సేవల్లోకి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించుకునే అవకాశం ఉన్నందున, స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన సందర్భాల్లో అధికారిక ఎన్నికల సిబ్బంది, బీఎల్ ఓలు, ఈ ఆర్ ఓలు ప్రజలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.డ్రాఫ్ట్ ఓటర్ల జాబితానే సవరణకు కీలక అవకాశం ప్రస్తుతం అందుబాటులో ఉన్న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రతి ఓటరు తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాలోని వివరాలను ప్రస్తుత డ్రాఫ్ట్ జాబితాతో సరిపోల్చుకుని పేరు, వయస్సు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు తదితర అంశాల్లో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత ఫారం ద్వారా సవరణకు దరఖాస్తు చేయాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా లభించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అభ్యర్థనను అధికారులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడం, అర్హత లేని నమోదులను నిబంధనల ప్రకారం తొలగించడం, ఓటర్ల జాబితాను ఖచ్చితమైనదిగా, పారదర్శకంగా రూపొందించడం లక్ష్యంగా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

**రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు**

వార్డు సభ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, నో మ్యాపింగ్, ఏఎస్డీ కేటగిరీలకు సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నో మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న అర్హులైన ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు, వారు సమర్పించే దరఖాస్తులు, ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి న్యాయం చేయాలని ప్రతినిధులు సూచించారు. ఓటర్ల వివరాల్లో తప్పులు, చిరునామా మార్పులు, పోలింగ్ స్టేషన్ మ్యాపింగ్‌కు సంబంధించిన సమస్యలను కూడా పారదర్శకంగా పరిష్కరించాలని వారు కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వెల్లడించిన అభిప్రాయాలు, సూచనలను పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వార్డు సభలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, బాలాపూర్ తహశీల్దార్ ఇందిరా దేవి, బీఎల్ఓలు, బీఎల్ఏలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి





**ముద్ర, తుర్కపల్లి :** చౌక్లా తండా భూ నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం చౌక్లా తండా గ్రామంలో ప్రచార యాత్ర సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్వాపూర్ ప్రాజెక్టులోని ముంపుకు గురవుతున్న చౌక్లా తండా గ్రామపంచాయతీ భూనిర్వాసితులకు ప్రాజెక్టు ప్రారంభమై సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు 130 కోట్లకు పైగాను ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి రైతులు ప్రజలు భూనిర్వాసితులు అప్పుల మీద అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారని, ఆడపిల్లల పెళ్లిలకు ఉన్న ఎంతో కొంత భూమి అమ్మి పెళ్లిళ్లు చేద్దామంటే ప్రాజెక్టులో పోయింది గనక ఎవరు కొనలేని పరిస్థితి దాపురించిందని, మా బాధలు ఈ ప్రభుత్వంకు కనబడడం లేదా అని వారు ఆవేదన గురవుతున్నారు .భువనగిరి జిల్లా నూతనంగా ఏర్పడి శతాబ్దం అవుతున్నప్పటికీ జిల్లాలో ఇప్పటివరకు ఒక్క సాగునీటి ప్రాజెక్టు పురోగతి సాధించలేదన్నారు. జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల కు నిధుల సాధనక్షై డిమాండ్ చేస్తూ ఆగస్టు 29, 30, 31 తేదీల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని 29న భువనగిరి అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31 ఇందిరా పార్క్ వరకు చేరుకొని మహాధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని 31న జరిగే చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ మహాధర్నాకు వేలాదిగా రైతులు ప్రజలు పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య ,ఆవుల కళమ్మ, తుటి వెంకటేశం పాల్గొన్నారు



## ఏడుపాయలలో ఘనంగా పల్లకి సేవ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వనదుర్గా మాత అమ్మవారి సన్నిధిలో పౌర్ణమి పురస్కరించుకొని గురువారం సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. అర్చకులు పార్థివ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తి ఉంచి పల్లకి ఊరేగించారు. ఆలయ సిబ్బందితోపాటు మహిళా భక్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు. -ముద్ర ప్రతినిధి మెదక్

## మధ్యాహ్న భోజన పథకం తీరు పరిశీలన



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని గాంధీనగర్ వార్డ్ నెంబర్ 20లోని ఎంపిపిఎస్ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందుతున్న సదుపాయాలపై స్థానిక బి ఆర్ఎస్ కౌన్సిలర్ నవీన సంతోష్ గౌడ్ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పాఠశాలలో విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక



**ముద్ర, తుర్కపల్లి:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశానుసారం రాష్ట్ర అధ్యక్షుడు కేదాస్ మోహన్ పిలుపుమేరకు తుర్కపల్లి మండలంలో గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల ఉప్పలయ్య ,వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లూరి యాదగిరి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ నూతన అధ్యక్షునిగా కోట చరణ్ తేజ్, ఉపాధ్యక్షులుగా కోట లింగస్వామి, ప్రధాన కార్యదర్శిగా కోట పవన్ కుమార్, కోశాధికారిగా గడ్డమీది విగ్నేష్, కార్యదర్శిగా గడ్డమీది వంశీ నియమించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కోట ధనుష్, బండారి ప్రశాంత్, పాల్గొన్నారు

## తెలంగాణలో ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్..

**ఎలక్ట్రిక్ ఆటోలకు ప్రోత్సాహం**

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్–2026కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ జీవో విడుదల చేసింది.ఇంధన ఖర్చులను తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించడం, ఆటో డ్రైవర్లకు నిర్వహణ భారం తగ్గించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే దిశగా ఈ పథకం కీలకంగా మారనుంది.

## దేవాదాయ శాఖ డైరెక్టర్ కు అమ్మవారి పట్టుచీర



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** నెల రోజులపాటు ఆషాడ మాస బోనాల జాతర వైభవంగా, విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికి అభివందనాలు తెలియజేస్తున్నానని దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు అన్నారు. శ్రీ గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారి వృత్తి పని వార్ల అధ్యక్షులు శివశంకర్ ఆధ్వర్యంలో గురువారం దేవాదాయ శాఖ డైరెక్టర్ ను కలిశారు. డైరెక్టర్ హనుమంతరావుకు గోల్కొండ జగదాంబికా అమ్మవారి పట్టుచీర, ఒడి బియ్యం, అమ్మవారి గాజులు, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగం సలహాదారులు రావులకోల్ల నర్సింగ్ రావు, కాసాల శివశంకర్, అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్, ప్రధాన కార్యదర్శి హర్ష, సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామ మందిర నిర్మాణానికి చేయూత

**మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ దంపతులు**

**ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.11 లక్షల విరాళం**

**కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ సభ్యులు**



**ముద్ర ప్రతినిధి, తాండూరు:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం లోని ఇంద్రనగర్‌లో నెలకొని ఉన్న ఏకైక రామ మందిరం పునర్నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి దంపతులు చేయూత అందించారు.దైవభక్తితో తమ వంతుగా రూ.1.11 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పట్లోళ్ల దంపతులు మాట్లాడుతూ.. రామ మందిరం పునర్నిర్మాణానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా భక్తులు, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.విరాళం అందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మండపంతో పాటు మరికొన్ని పనులు ఇంకా పూర్తిచేయాల్సి ఉందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు, దాతలు ముందుకు వచ్చి ఈ యొక్క పుణ్య కార్యంలో తమ వంతు సహకారం అందించి రామ మందిరం అభివృద్ధికి తోడ్పడాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారం





**ముద్ర, హైదరాబాద్: ఆగస్టు 27 :** విధి నిర్వహణ అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ కంబాల శంకర్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారంను గురు వారం డిజిపి సి.వి.ఆనంద్ చేతుల మీదుగా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు అందించారు. మల్కాజిగిరి కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కంబాల శంకర్ (31) మార్చి 28న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వాడపర్తి గ్రామం వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలతో తొలుత ఎయిమ్స్‌కు, అనంతరం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా.. మార్చి 31న మృతి చెందారు.శంకర్ జీతం బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతాలో జమయ్యేది. ప్రమాదంపై బ్యాంకుకు సమాచారం అందడంతో బీమా క్లెయిమ్ ప్రక్రియ చేపట్టారు. జీటీఎల్ కింద రూ.15 లక్షలు, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జీపీఏ) కింద రూ.80 లక్షలు కలిపి మొత్తం రూ.95 లక్షల పరిహారం మంజూరైంది. ఈ కార్యక్రమంలో ఐజి వెల్ఫేర్ గజరావు భూపాల్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎం.వి.ఎస్. సుధాకర్, ఎస్ కె ప్రసాద్, రవి పాల్గొనగా, రూ.95 లక్షల చెక్కును డీజీపీ సి.వి. ఆనంద్ చేతుల మీదుగా మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.

## కూకట్‌పల్లిలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



**ముద్ర, కూకట్‌పల్లి :** నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్‌లో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ గౌడ్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున చేరడం శుభపరిణామమని, ప్రజల్లో రోజురోజుకూ పార్టీకి ఆదరణ పెరుగుతోందని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, ప్రభుత్వ లబ్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మరియు సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుండె ఆరోగ్యానికి తోడ్పాటు

రాగుల్లో ఫైబర్, పాలీఫెనాల్స్ వంటి పోషక సమ్మేళనాలు ఉంటాయి. ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా వీటిని తీసుకోవడం గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తోడ్పడుతుంది.



## 'రాహుల్.. ఢిల్లీకి ఒక నీతి.. తెలంగాణకు మరో నీతా?'




**ముద్ర, వరంగల్ :** పాలిటెక్నిక్ విద్యార్థులపై రేవంత్ సర్కారు కర్కశంగా వ్యవహరిస్తోందని బీఆర్ ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని మండిపడ్డారు. పాలిటెక్నిక్ విద్యార్థులేమన్నా టెర్రరిస్టులా? అని ప్రశ్నించారాయన. తెలంగాణ విద్యార్థుల సమస్యలు రేవంత్ కు పట్టవా?అని నిలదీశారు హరీష్ రావు. 'విద్యార్థులు వారి భవిష్యత్తు కోసం పోరాటం చేస్తుంటే వాళ్ళ జీవితాలతో ఆడుకుంటున్నారు. రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉండడం మా దౌర్భాగ్యం అంటున్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నావ్. తెలంగాణ విద్యార్థులు నీ కంటికి కనిపించడం లేదా...?, జెన్ జీ అంటూ డిల్లీలో ధర్నాలు చేస్తున్న రాహుల్ గాంధీకి ఈ పాలిటెక్నిక్ విద్యార్థులు కనిపించడం లేదా?, జెన్ జీ రోడ్డెక్కి పోరాడుతుంటే ఎందుకు స్పందించడం లేదు. ఢిల్లీకి ఒకనీతి.. తెలంగాణకు మరో నీతా రాహుల్ గాంధీ. రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి విద్యారుల కోసం పోరాడాలి. డిల్లీ తరహాలో విద్యార్థులు తిరగడబడక ముందే.... డిల్లీ తరహా ఉద్యమాలు జరగక ముందే... రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు' అని హెచ్చరించారు.

## జీవో 97పై బీజేపీ ఫైర్.. విద్యార్థులకు అండగా కిషన్ రెడ్డి



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతోంది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను.రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న మా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారితో పాటు పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనం. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదు?పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్య (ఈసెట్) అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలి. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా వివాదాస్పద జీవో 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలి. తెలంగాణ విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజీలేని పోరాటం చేస్తుంది.

## చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలి

- మంత్రి కోమటిరెడ్డి



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్–విజయవాడ హైవేపై 17 బ్లాక్ స్పాట్లు ఉన్నచోట ఫ్లైఓవర్లు త్వరలో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రహదారులపై మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలన్నారు. మిగతా ఫ్లైఓవర్లు డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రమాదాలు నివారించాలంటే రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని పేర్కొన్నారు. 6+2 లేన్ల రహదారి విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసినట్లు కోమటిరెడ్డి తెలిపారు.

## గుండెపోటుతో యువకుడి మృతి



**ముద్ర, దేవరకొండ :** గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం కొండమల్లేపల్లి పట్టణంలో జరిగింది. పట్టణ కేంద్రంలోని పాతూరుకు చెందిన పసునూరి మీనాచారి–రమాదేవిల కుమారుడు అనిల్ కుమార్(26) డిగ్రీ చదివాడు. ఓ పక్క కానిస్టేబుల్ ఉద్యోగానికి సన్నద్ధమవుతూనే ఇంటి వద్ద తన తండ్రి నిర్వహిస్తున్న కార్పెంటర్ దుకాణంలో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. అంతేకాకుండా ఉదయం సాయంత్రం జేబీ కాలనీలోని ఓ కిడ్స్ పాఠశాల వ్యాన్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం పాఠశాల పిల్లలను వ్యాన్ లో ఎక్కించుకుని వెళ్తున్న క్రమంలో బస్టాండ్ సమీపంలో తనకు గుండె వద్ద నొప్పి వచ్చినట్లుగా అన్పించడంతో వెంటనే వ్యాన్ ను పక్కకు ఆపి తనకు తెలిసిన అంజి అనే డ్రైవర్ ను పిలిచాడు. విషయం చెప్పి విద్యార్థులను వారి ఇళ్ల వద్ద దించాలని సూచించాడు. అనంతరం పక్కనే ఉన్న తనకు తెలిసిన వారి ఇంటి వద్దకు వెళ్లి వాష్రూంకు వెళ్లాడు. 20 నిముషాలు దాటినా బయటికి రాకపోవడంతో తలుపు తీసి చూడగా కింద పడి ఉన్నాడని వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించామని మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా

**ముద్ర, కరీంనగర్ :** పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కాంట్రాక్ట్, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ ఛైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ ధర్నాలో టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, ఉద్యోగులు పాల్గొన్నారు.




## రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ శుభాకాంక్షలు



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో ప్రభుత్వం పథకాలు అమలుచేస్తోందని సీఎం వెల్లడించారు.

**సహోదరత్వం అత్యంత గొప్ప బంధం: కేసీఆర్**

రాఖీ నేపథ్యంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ సంబంధాలలో సహోదరత్వం అత్యంత గొప్ప బంధం అని పేర్కొన్నారు. అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల అనుబంధం అజరామరం అని తెలిపారు. రాఖీ బంధన్ భారత కుటుంబ జీవనంలో ప్రత్యేక సంప్రదాయ వేడుక అని చెప్పారు. ప్రజలంతా సౌభ్రాతృత్వంతో జీవించడం తోనే వసుదైక కుటుంబ భావన పరిఢవిల్లుతుందన్నారు.

## కరీంనగర్‌లో ఓటర్ల విచారణ గందరగోళం

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నోటీసులు అందుకున్న వారి విచారణ గందరగోళంగా మారింది. బుధవారం కళాభారతిలో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేయగా, ఒక్కరోజే సుమారు 3 వేల మంది ఓటర్లకు విచారణకు తేదీలు కేటాయించారు. దీంతో కేంద్రం వద్ద భారీగా రద్దీ ఏర్పడింది. బీఎల్‌వోలు, సిబ్బంది ఆన్‌లైన్ ప్రక్రియను నెమ్మదిగా నిర్వహించడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు, విదేశాల్లో ఉన్న ఓటర్లు ఎలా విచారణకు హాజరవుతారని పలువురు ప్రశ్నించారు. ఇంటి వద్దే విచారణ నిర్వహించాలని కోరుతున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పించినా మళ్లీ విచారణ కేంద్రానికి రావాలని చెబుతుండటంపై కూడా ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. నోటీసులు స్వీకరించిన తర్వాత రసీదు ఇవ్వకపోవడంపైనా వారు అభ్యంతరం తెలిపారు.



## ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుతున్న సర్పంచ్

**ముద్ర న్యూస్, సైదాపూర్:** మండలంలోని ఘనపూర్ గ్రామ సర్పంచ్ బాసరాజు రజిత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నారు. తనను సర్పంచిగా గెలిపిస్తే తన పదవీకాలంలో గ్రామంలో ఆడపిల్ల పుడితే ఆ కుటుంబానికి రూ.5,116 ప్రోత్సాహకంగా అందిస్తానంటూ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఈ మేరకు గ్రామానికి చెందిన దంపతులకు ఆడపిల్ల పుట్టగా వారికి రూ.5,116 అందించారు. తాను గెలిచిన 8 నెలల కాలంలో ఇప్పటివరకు గ్రామంలో ముగ్గురు ఆడపిల్లలు పుట్టారని.. వారి కుటుంబసభ్యులకు రూ.5,116 చొప్పున అందజేసినట్లు తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నియోజకవర్గంలోనే ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటా మని సర్పంచ్ తెలిపారు.



# మోడీ వైపే ప్రజలు.. కాక్రోచ్ పార్టీకి షాక్..

**పేపర్ లీక్‌లు, నిరుద్యోగంపై యువతలో తీవ్ర అసంతృప్తి.**
**పరీక్షా వ్యవస్థపై యువతకు అపనమ్మకం..**
**అయినప్పటికీ మోడీపైనే దేశ ప్రజల విశ్వాసం..**

**ముద్ర ఢిల్లీ :** దేశ రాజకీయ ముఖచిత్రాన్ని ప్రతిబింబించే "మూడ్ ఆఫ్ ది నేషన్ (MOTN)" ఆగస్టు 2026 ఫలితాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మరోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 326 సీట్లతో అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి 185 సీట్లు వస్తాయని అంచనా వేసింది. అయితే, ప్రశ్నాపత్రాల లీకేజ్, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి అంశాలపై యువత అసంతృప్తిగా ఉన్నప్పటికీ, ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం వైపే యువత ,జెన్–జీ ఉన్నట్లు తెలిపింది.

ఇటీవల ప్రశ్నాపత్రాల లీకులు, కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం నేపథ్యంలో ఈ సర్వే కీలక విసయాలను వెల్లడించింది. . పరీక్షల నిష్పాక్షికతపై 40 శాతం మంది యువతకు నమ్మకం లేదని, మరో 27 శాతం మంది ఈ వ్యవస్థపై చాలా తక్కువ నమ్మకం ఉందని తెలిపారు. మొత్తంగా 67 శాతం మంది యువత పరీక్షా వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేయగా, కేవలం 14 శాతం మంది మాత్రమే అది పూర్తిగా నిష్పాక్షికంగా ఉందని భావించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతోందని, నమ్మదగినదిగా లేదని 17 శాతం జెన్–జీ యువత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యంపై ప్రశ్నించగా.. రిగ్గింగ్, అవినీతిని అరికట్టడంలో విఫలమవడమే ప్రధాన కారణమని 9.8 శాతం మంది చెప్పారు. గత సర్వేలో ఈ అభిప్రాయం కేవలం 1.4 శాతంగా ఉండటం గమనార్హం.

**నిరుద్యోగంపై యువతలో ఆగ్రహం..**

ప్రశ్నాపత్రాల లీకేజీలపై ఉన్న ఆగ్రహానికి నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తోడైనట్లు సర్వే వెలల్లడించింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యగా 22.7 శాతం మంది నిరుద్యోగాన్ని పేర్కొన్నారు. నిరుద్యోగ పరిస్థితి చాలా తీవ్రమైందిగా 42.3 శాతం, మరో 23.8 శాతం తీవ్రమైందిగా పేర్కొన్నారు. బీజేపీ కూటమి ప్రభుత్వంలో 23 శాతం ద్రవ్యోల్బణం, 15.9 శాతం మంది నిరుద్యోగాన్ని అతిపెద్ద వైఫల్యాలుగా చెప్పారు. రోజూ వారీ ఖర్చులు గతేడాదితో పోలిస్తే కష్టంగా మారిందని 65 శాతం మంది చెప్పారు.

**సీజేపీకి షాక్..**

పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా, విద్య కోసం, జెన్–జీ కోసం పోరాడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)కి ప్రజలు షాక్ ఇచ్చారు. 39 శాతం మంది యువత అది 'ప్రెజర్ గ్రూపు''గానే పనిచేయాలని, రాజకీయ పార్టీగా మారకూడదని చెప్పారు. ఒక వేళ సీజేపీ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓటు వేస్తారా అనే ప్రశ్నకు 43 శాతం మంది నిరాకరించగా, 33 శాతం మంది మద్దతు తెలిపారు.

**సమస్యలు ఉన్నా మోడీకే మద్దతు..**

ఇలాంటి ఆందోళనలు ఉన్నప్పటికీ ఇప్పటికీ దేశంలో అత్యంత ప్రజాధరణ కలిగిన రాజకీయ నాయకుడిగా ప్రధాని నరేంద్రమోడీ ఉన్నారు. 48.7 శాతం మంది ప్రజలు ఇప్పటికీ నరేంద్ర మోదీని తదుపరి ప్రధానమంత్రిగా తమ మొదటి ఎంపికగా భావిస్తుండగా, 27.1 శాతంతో రాహుల్ గాంధీ రెండవ స్థానంలో ఉన్నారు. సర్వకాలీన ఉత్తమ ప్రధానమంత్రి రేసులో కూడా 41.1 శాతంతో నరేంద్ర మోదీ ముందంజలో ఉన్నారు. 51.3 శాతం మంది ప్రజలు ప్రధానమంత్రి వ్యక్తిగత పనితీరును అద్భుతం పనిచేశారని అభిప్రాయపడ్డారు. యూనిఫామ్ సివిల్ కోడ్ (UCC)కి 75.0 శాతం, చొరబాట్ల నియంత్రణకు 76.2 శాతం, ఒకే దేశం ఒకే ఎన్నికకు 70.4 శాతం, కఠినమైన ఫిరాయింపుల నిరోధక చట్టానికి 64.4 శాతం మద్దతు లభించింది. అంతేకాకుండా, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే దార్శనికత పట్ల దేశంలో 57.6 శాతం మంది ఉత్సాహంగా ఉన్నారు. మొత్తం మీద ఎన్డీయే ప్రభుత్వ పనితీరుకు 50.4 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.



**బీజేపీకి సవాళ్లు..**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు అనుకూలతలు ఉన్నప్పటికీ, సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. దేశ ప్రజాస్వామ్య పరిస్థితి ప్రమాదంలో ఉందని 46.7 శాతం మంది భావిస్తుండగా, 41.6 శాతం దీనితో విభేదించారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై 40.9 శాతం మంది అనుమానాలు వ్యక్తం చేశారు. అయోధ్య రామ మందిరంలో జరిగిన దొంగతనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టను దెబ్బతీసిందని 46.6 శాతం మంది అభిప్రాయపడ్డారు. E20 పెట్రోల్ మార్పులకు 58 శాతం మంది మద్దతు తెలిపారు. మత సామరస్యం పరిస్థితి మెరుగుపడిందని 34 శాతం మంది మాత్రమే భావించగా, 29.5 శాతం మంది పరిస్థితి దిగజారిందని చెప్పారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 28.08.2026
www.mudranews.in | @mudranews



## రాగులతో జీర్ణవ్యవస్థకు మేలు

రాగుల్లో ఉండే ఆహారపు పీచు మలబద్ధకాన్ని తగ్గించడంలో, పేగుల పనితీరును మెరుగుపర చడంలో సహాయప డుతుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఇవి మంచి ఎంపిక.



# విద్య, వైద్య రంగాల బలోపేతానికి పెద్దపీట

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 27 :** రాష్ట్రంలో ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడంతో పాటు పేద ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గోపాలపురం లో రూ. 30 లక్షల నిధులతో చేపట్టిన నూతన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ దివాకర టీఎస్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో సంక్షేమం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నాయకత్వంలో గడిచిన రెండున్నరేళ్ల ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు గత పాలక మండలి కంటే రెండు మూడు రెట్లు అధికంగా నిధులు కేటాయించినట్లు స్పష్టం చేశారు. నూతన ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం, వైద్యులు, సిబ్బంది నియామకం ద్వారా పేదవారిపై వైద్య ఖర్చుల భారం పడకుండా చూస్తున్నామన్నారు. సాంకేతిక విద్యను బలోపేతం చేస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ద్వారా యువతకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామని పొంగులేటి తెలిపారు.క్షేత్రస్థాయిలో మహిళలను ఆర్థికంగా బలపరిచేందుకు గడిచిన రెండున్నరేళ్లలో రూ. 63 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని వెల్లడించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని 3వ, 4వ విడతల్లో కూడా విస్తరిస్తామని చెప్పారు. అర్హులైన వారందరూ ఈ నెల 31 లోగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

**రాఖీ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**

.పాలేరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ మంత్రి శ్రీనివాసరెడ్డి ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షంలోనూ మిన్నంటిన 'ఉద్యోగుల మహాగర్జన'

### ఖమ్మంలో టీజీఈజేఏసీ ధర్నా సక్సెస్, భారీ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం ఆగస్టు 27 :** ఉద్యోగాల న్యాయమైన హక్కులు, ఆర్థిక ,సర్వీస్ ప్రయోజనాల సాధన కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'మహాధర్నా' నిర్వహించారు. ఉదయం నుంచి కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ధర్నాకు అశేష సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు ఉద్యోగుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.2వ పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను విడుదల చేయడం, సుమారు రూ. 10,000 కోట్ల



పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్య పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలనీ వారు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు అందించేది ఉద్యోగులేనని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యల వల్ల ఉద్యోగ వర్గాల్లో ఉన్న ఆవేదనను ప్రభుత్వం సానుభూతితో అర్థం చేసుకుని తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. వచ్చే నెల 10వ తేదీన



హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి ఖమ్మం నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.అన్ని సంఘాల సమన్వయంతోనే మహాధర్నా విజయవంతమైందని జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. సునీల్ రెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, కట్టా శేఖర్, రంగారావు, రాయల నరసింహారావు, ఎస్.కే. రంజాన్, దుర్గా భవానీలతో పాటు పెన్షనర్స్, మున్సిపల్, ఇరిగేషన్ ఫోరమ్ ప్రతినిధులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినూత్నంగా వృక్షాబంధన్



**ముద్ర, మోత్కూరు:** ప్రకృతిని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని మోత్కూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు అన్నారు. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని గురువారం మోత్కూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు వృక్షాబంధన్ కార్యక్రమాన్ని వినూత్నంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లకు రాఖీలు కట్టి వినూత్నంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ చెట్లు మనకు ప్రాణవాయువు తోపాటు జీవవైవిధ్యాన్ని కల్పించి మానవ మనుగడకు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు బాల్యం నుండే ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీ వ్యక్తికి గాయాలు



**ముద్ర, మోత్కూర్:** మోత్కూరు మండలంలోని అనాజిపురం గ్రామంలో రెండు కార్లు ఢీకొనడంతో హోండా అమేజ్ టీఎస్ 05 ఎఫ్ డీ 5595 గల కారు నల్గొండ నుండి ఆత్మకూరు ఫంక్షన్ కి వెళ్తున్న క్రమంలో ఎ పి 29ఎ ఆర్ 4014 ఐ 20 కార్ వలిగొండ నుండి తిరుమలగిరీ రూట్ లో వెళ్తున్న కారు అనాజిపురం క్రాస్ రోడ్ లో ఢీ కొట్టడం తో ఐ 20 కారు లో ఉన్న ఇద్దరి వ్యక్తులకి గాయాలు కావడంతో స్థానికులు వెంటనే మోత్కూర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ గెజిటడ్ కార్మిక పెన్షనర్ల సమస్యలను పరిష్కారం కోసం గురువారం జిల్లా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు వేలాది మందితో ఆందోళన మహా ధర్నా కార్యక్రమం పెద్దయెత్తున నిర్వహించారు. ఈ మహా ధర్నా కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ గెజిటడ్ కార్మిక పెన్షనర్లు పెద్దయెత్తున పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్ల సాధనకై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పదేపదే హామీ ఇస్తున్న సమస్యల అమలుకు నోచుకోలేక అనేకసార్లు వేచి చూసి చివరికి ముఖ్య మంత్రి స్వయంగా ఉద్యోగ సంఘాలను పిలిచి సుమారు 3 గంటల పాటు చర్చలు జరిపి స్వయంగా హామీ ఇచ్చిన ప్పటికిని నేటి వరకు ఎలాంటి అమలుకు నోచుకోలే



దన్నారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్యం, పి ఆర్ సి, రావలసిన 6 పెండింగ్ డి ఏ లను ఒకేసారి ఏక మొత్తంలో విడుదల చేయా లన్నారు. నూతన పెన్షన్ విధానం (సీపీస్ ) ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుపరచాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగ సెక్రెటరీ జెనరల్ ధరణికోట భగత్, అడిషనల్ సెక్రెటరీ జెనరల్ కుంట్ల అమరేం దర్ రెడ్డి, కొ చైర్మెన్స్ ఎం. యాదయ్య, చీకూరి జగన్, పదురి శ్రీకాంత్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ నాగిరెడ్డి, డిప్యూటీ సి.ఈ.ఓ. శ్రీనివాస్, టి.ఎన్.జి.ఓ జిల్లా కార్యదర్శి ఎం.డి.ఖదీర్, కోశాధికారి కంచనపల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు పెండెం శ్రీనివాస్, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు కె.మోహన్ రెడ్డి, బి. బాలరాజు, అరుణ, ఆర్. శైలజ, కె. ఆనంద్, ఎం.డి. అజీజ్ అలీ ఖాన్, డాక్టర్ పి. శ్రీకాంత్, వి. అశోక్ కుమార్, కె. వినోద్ రెడ్డి, మొయిజున్నిసా బేగం, మాటూరి అశోక్, యాదాద్రి దేవాలయ జె.ఏ.సి. నేతలు సురేంద్ర చార్యులు, రఘు, పరమేష్, శ్రవణ్, ఎన్ లక్ష్మీనరసింహరెడ్డి, మెహతాబ్ సైదులు, పంచాయత్ సెక్రెటరీ ఫోరం అధ్యక్షుడు గణగాని శశికాంత్ గౌడ్, నరేందర్, పి. శ్రీకాంత్, మెడికల్ ఫోరం అధ్యక్షులు వెంకట రమణ రెడ్డి, కార్యదర్శి, సత్యానారాయణ గజిటెడ్ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కె. శ్రీనివాస్, జి. అంబిక, వై. శ్రీనివాస్ రెడ్డి ఎం.పి.డి.ఓ, ఏ.ఓ ఎన్. అంజిరెడ్డి, బి. శ్రీనివాస రాజు, బోయ రాములు, జి. లింగయ్య, జి. శ్రీనివాస్, కె. రమేష్, వి. నరేందర్, కె. యశోద, ఎం. కృష్ణ, బి. బాలరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వారి వివరాలను



ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఈ నెలలో ఎన్ని ప్రసవ అంచనా తేదీలు ఉన్నాయని, ఇప్పటి వరకు ఎన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ఎన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



**ముద్ర, దేవరకొండ :** మహమ్మద్ జహంగీర్ జయంతి సందర్భంగా వారి తమ్ముళ్లు, కుటుంబ సభ్యులు,స్నేహితులు కలిసి దేవరకొండ పట్టణంలోని మహాలక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. వృద్ధులు అందరికీ ఆశీర్వాదాలు అందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్ తమ్ముళ్లు, స్నేహితులు, ఇమ్రాన్, రియాజ్, ఆమెర్, గఫ్ఫార్, గౌస్,తోసిఫ్,జమీల్, ఫయాజ్, కుటుంబ సభ్యులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా మహమ్మద్ జహంగీర్ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకుంటామని వారు పేర్కొన్నారు.

## ఆయుర్వేదిక్ వేదాలెక్స్ స్టోర్ ను ప్రారంభించిన సర్పంచ్

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణంలో బస్టాండ్ ఎదురుగా పాత ఆదర్శ స్కూల్ పక్కన ఆయుర్వేదిక్ వేదాలెక్స్ స్టోర్ ని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి ప్రారంభించారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం విశ్వసనీయమైన ఆయుర్వేదిక్ ఉత్పత్తులను అందరూ వినియోగించాలన్నారు. అనం తరం వేదాలెక్స్ స్టోర్ యజమాని వస్కుల యాదయ్య సర్పంచ్, ఉప సర్పంచ్ లను సన్మానించారు. ఉప సర్పంచ్ కొడిదాల



పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు వస్కుల శ్రీనివాస్, బిజిలి లింగం, పర్వతం కొండల్, గంట మల్లేష్, స్కార్పియన్ స్టార్ రఫీ, మెగాస్టార్ మహేష్, నేలంటి కిరణ్, వస్కుల వెంకటేష్, ఆంజనేయులు, రాజేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి మైన్స్ ఏడీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

**ముద్ర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీఈ బొజ్జ జయరాజ్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి భూపాలపల్లి, హైదరాబాద్ బోడుప్పల్‌లోని ఆయన నివాసాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. భూపాలపల్లి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న దోపిడీదారులతో జయరాజ్ చేతులు కలిపారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.ఏసీబీ అధికారులు భూపాలపల్లితో పాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు సహా మొత్తం 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. సోదాలు పూర్తయిన అనంతరం ఆస్తులు, కీలక పత్రాలు, ఇతర వివరాలపై ఏసీబీ అధికారులు స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## మార్కెట్‌కు 3 రోజుల సెలవు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 27 :** రక్షాబంధన్ పండుగతో పాటు వారంతపు సెలవుల కారణంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజుల పాటు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.ఆగస్టు 28వ తేదీ శుక్రవారం రాఖీ పౌర్ణమి రక్షాబంధన్, 29వ తేదీ శనివారం వారంతపు సెలవు , 30 వ తేదీ ఆదివారం రోజుల్లో మార్కెట్‌లో అన్ని రకాల కొనుగోళ్లు, అమ్మకాలు, యార్డు లావాదేవీలు పూర్తిగా బంద్ ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.తిరిగి ఆగస్టు 31వ తేదీ సోమవారం ఉదయం నుంచి మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులు, వ్యాపారులు, హమాలీలు గమనించి, సెలవు రోజుల్లో పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని మార్కెట్ కమిటీ పాలకవర్గం విజ్ఞప్తి చేసింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 27:** రాష్ట్రంలో పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జెడ్పీ సెంటర్ వద్ద బిజేపి చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు విద్యాసంస్థల బకాయిలపై ఆందోళన చేపట్టారు.శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. రహదారిపై బైఠాయించిన నాయకులను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వక దాదాపు 40 లక్షల కుటుంబాలు, యువత రోడ్డున పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులను రోడ్లపై తిరగనివ్వబోమని హెచ్చరించారు. నాయకులను గృహనిర్బంధం చేయడం, అక్రమ అరెస్టులు చేయడం కాంగ్రెస్ నిరంకుశ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్యామ్ రాథోడ్, నున్న రవి కుమార్, అల్లిక అంజయ్య, కొణతం లక్ష్మీనారాయణ, నకిరేకంటి వీరభద్రం, శ్రీరామనేని మణి, మంద సరస్వతి, పమ్మి అనిత, సాయిరాం తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఖమ్మం ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చాలి

### సీపీఎం డిమాండ్

### 31న కలెక్టరేట్ ముట్టడికి నున్నా నాగేశ్వరరావు పిలుపు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 27 :** ప్రభుత్వ వైద్యశాలను వెయ్యి పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ఈఎన్‌టీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సుందరయ్య భవనంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో విద్యా, వైద్య రంగాలు తీవ్రంగా నిర్లక్ష్యానికి గురైనట్లు తేలిందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కోట్లాది రూపాయలతో అందుబాటులోకి తెచ్చిన ఎంఆర్‌ఐ మిషన్‌కు ఆపరేటర్ లేకపోవడం శోచనీయమని, దీనివల్ల పేద ప్రజలు ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు, వైద్యుల కొరత కారణంగా 70 శాతం మంది ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారని, ప్రైవేట్ దవాఖానలు ప్రజలను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెంచిన పింఛన్లను వెంటనే చెల్లించాలని కోరారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతు బీమా పథకానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రీమియం చెల్లించకుండా నిలిపివేయడం సరికాదని, వెంటనే దానిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మాచర్ల భారతి, బండి రమేష్, వై.విక్రమ్, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ

## ఎస్ఐఆర్ సవరణపై అవగాహన




**ముద్ర, మోత్కూర్:** మున్సిపాలిటీ పరిధిలోని 11, 12వ వార్డులలో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సవరణపై వార్డు సభ నిర్వహించారు. వార్డు కార్యాలయం వద్ద జరిగిన ఈకార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, 12వ వార్డు కౌన్సిలర్ మెంట రమణ నగేష్ పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న 12వ వార్డు కౌన్సిలర్ మెంట రమణ నగేష్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని, తప్పులు ఉంటే సవరణ చేసుకోవాలని ఓటర్లకు నోటీసు అందినంత మాత్రాన ఓటు హక్కు కోల్పోయినట్లు కాదని స్పష్టం చేశారు. నోటీసులో పేర్కొన్న అంశాలపై ఏవైనా సందేహాలు, సమస్యలు ఉంటే అవసరమైన ఆధారాలతో సంబంధిత అధికారుల దృష్టికి, తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి మందుల సురేష్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ షాకీరుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు మొరిగాల వెంకన్న, మొరిగాల శ్రీను, కూరెళ్ల రమేష్, ఉప్పల రమేష్, బీజేపీ నాయకులు అన్నెపు సత్యనారాయణ, ఓటర్లు పాల్గొన్నారు..

## రాగులతో ఎముకలకు బలం



రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. కాబట్టి రాగులను ఆహారంలో చేర్చుకోవడం ఎముకలు, దంతాల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయి.

# చట్టబద్ధమైన దత్తత సురక్షితం

**కలెక్టర్ ప్రతిమా సింగ్**
**బాలికను దత్తత తీసుకున్న దంపతులు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** బాలల సంక్షేమం, సంరక్షణలో భాగంగా చట్టబద్ధమైన దత్తత ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టర్ సమక్షంలో హైదరాబాద్ కు చెందిన దంపతులు బాల సదన్ లో 11 సంవత్సరాల బాలిక అపర్ణను చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా తమ కుటుంబంలోకి స్వీకరించారు. 2025 లో ప్రభుత్వ పోర్టల్ మిషన్ వాత్సల్య ద్వారా చట్టబద్ధ దత్తత కోసం హైదరాబాద్ కు చెందిన దంపతులిద్దరూ దరఖాస్తు చేసుకున్నారు.బాలల సంక్షేమానికి సంబంధించిన నిబంధనలను పాటిస్తూ, అధికారిక ప్రక్రియ ద్వారా దత్తత తీసుకోవడం ద్వారా బాలలకు సురక్షితమైన, ప్రేమతో కూడిన కుటుంబ వాతావరణాన్ని కల్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. దత్తత తీసుకునే తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను, సంబంధిత అధికారుల మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. బాలలను చట్టవిరుద్ధంగా దత్తత తీసుకోవడం లేదా ఇవ్వడం చేయరాదని, దత్తతకు సంబంధించి ఎలాంటి అనధికార మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం దత్తత తీసున్న బాలిక బాగోగులను ప్రతి 6 నెలలకు ఒకసారి పరిశీలిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాలికను దత్తత తీసుకున్న దంపతులను అభినందించారు. బాలికకు మంచి భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డిసిపిఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోండి**

నూతన చేయూత పింఛన్ల కొరకు లబిదారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్త చేయూత పింఛన్ల దరఖాస్తులు మండల, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు చేయత పింఛన్ల దరఖాస్తుల సమ స్యల పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. పింఛన్ల కొరకు దర ఖాస్తు చేసుకునే లబిదారులు ఏదైనా ధృవీ కరణ పత్రం లేనియెడల వెంటనే సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్లి తక్షణమే తీసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకునేటప్పుడు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కలెక్టరేట్లో ఉన్న హెల్ప్ డెస్క్ సహాయకారిణిగా పనిచేస్తుందని,సమస్య ఉన్నట్లయితే వెంటనే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు. అర్హులైన వారు త్వరితగతిన దరఖాస్తు చేసుకొని లబ్ది పొందాలని సూచించారు.

**సోదర భావానికి ప్రతీక రాఖీ**

సోదర భావానికి ప్రతీక రాఖీ పండుగ అని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. జిల్లా ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదర,సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాఖీ కట్టేందుకు ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## ప్రతి ఒక్కరి ఓటు పరిరక్షణే సర్ లక్ష్యం

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రతి ఒక్కరి ఓటు పరిరక్షణే సర్ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులోని పశువైద్యశాలలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ సర్ వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండాలనే ఉద్దేశంతో ప్రజలతో కలిసి సభ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై సర్ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి అర్హుడి ఓటు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, ఒక్క అర్హుడి ఓటు కూడా పోకుండా కాపాడుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏవైనా లోపాలు ఉన్నట్లయితే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. ప్రతి ఓటు విలువైనదని, ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొంటూ, ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భువనగిరి సర్ కోఆర్డినేటర్ ఇ.వి. శ్రీనివాస్ రావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, పిఏసిఎస్ చైర్మన్ కొండల్ రెడ్డి, ఆర్టిఓ కృష్ణారెడ్డి, తాసిల్దార్ జగన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్ గుర్రాల సంతోష శ్రీనివాస్, కౌన్సిలర్స్ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బి ఎల్ ఏ లు పాల్గొన్నారు.

## ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యంమని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గంధమల్ల ముంపు బాధితులకు పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు.గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న ముంపు బాధితులకు నష్టపరిహారం క్రింద 352 ఎకరాలకు 88.84 కోట్ల రూపాయల చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లడుతూ గంధమల్ల రిజర్వాయర్ కోసం భూములు ఇచ్చిన రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల, ఇరిగేషన్ యస్ ఈ రవీందర్, సర్పంచ్, ప్రజా ప్రతినిధులు,గంధమల్ల రిజర్వాయర్ ముంపు బాధిత రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పి.వి. శ్యాంసుందర్ రావు జన్మదిన వేడుకలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పి.వి.శ్యామ్ సుందర్ రావు జన్మదినోత్సవం పురస్కరించుకుని బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు కొండం ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణం రాయగిరిలోని సౌహృదయ అనాధ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ పెద్దలు శ్యామ్ సుందర్ రావు ఆయురారోగ్యాలతో, సుఖఃసంతోషాలతో తమ జీవితాన్ని గడిపేలా ఆశీర్వదించాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు. సమాజ సేవలో తమ పి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన శ్యామ్ సుందర్రావు గారు మరింత గొప్పగా సమాజ సేవకు అవసరమయ్యే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర పాలసీ రీసెర్చ్ కన్వీనర్ సుర్వీ శ్రీనివాస్ గౌడ్, నీలం రమేష్, కోళ్ల బిక్షపతి గారు,జనగాం నరసింహ చారి, రత్నపురం శ్రీశైలం, బెజ్జంకి రామకృష్ణారెడ్డి, యాట వెంకటేష్ గారు,వాస నర్సింగ్, ఎదుగాని సంతోష్, ఆవుర్ల నరేష్ యాదవ్, తాళ్లపల్లి చంద్రశేఖర్, అవిశెట్టి మల్లేష్ యాదవ్, ఆకుల మహేష్ పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన అదనపు కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు గురువారం సందర్శించి పాఠశాలలోని విద్యా, వసతి సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, భోజనం, వసతి, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గది కి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు.మంచి మంచి గాచదుకోవాలని అన్నారు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించాలి



**ముద్ర, తుర్కపల్లి:** గ్రామ సభల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం మాదాపురం, తుర్కపల్లి గ్రామాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైందని అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ద్వారా జాబితాలో ఉన్న తప్పులు పొరపాట్లను సరి చేసుకోవడంతోపాటు అర్హులైన కొత్త ఓటర్ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు సీతరాజు, సోముల వెంకటేశం, పిఎసిఎస్ చైర్మన్ ధనావర్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో లంకల గీతారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పని గట్ల సుదర్శన్ గౌడ్,రాష్ట్ర నాయకులు పలుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఐమాక్స్ లైట్లు ప్రారంభం**

మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఐమాక్స్ లైట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోమల వెంకటేశం సన్మానించారు. పిఎసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ భూక్య రాజారాం నాయక్, మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## మానవత్వం చాటుకున్న బీఎంఆర్ఎస్ చైర్మన్

**మాజీ ఉపాధ్యాయుడు సంతోష్ కుటుంబానికి**
**రూ. 50 వేల ఆర్థిక సాయం**
**భార్యకు పాఠశాలలో ఉద్యోగం,**
**కుమారుడికి ఉచిత విద్య**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఆపదలో ఉన్న తమ పాఠశాల ఉపాధ్యాయుడి కుటుంబానికి నేనున్నాను అంటూ మానస విద్యామందిర్ హైస్కూల్ ( బిఎంఆర్ఎస్ ) చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో అకాల మరణం చెందిన పాఠశాల మాజీ మ్యాథ్స్ టీచర్ కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయంతో పాటు, ఆ కుటుంబానికి శాశ్వత భరోసా నిచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు. మోటకొండూరు మండలం లోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో గల మానస విద్యామందిర్ హైస్కూల్లో నిరునేముల సంతోష్ గతంలో మ్యాథ్స్ టీచర్గా పని చేశారు. ఆయన అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సంతోష్ మృతికి సంతాపంగా బుధవారం పాఠశాల ప్రార్థనా సమయంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయనకు అశ్రు నివాళులు అర్పించారు. మల్లారెడ్డి పెద్ద మనసు.. సంతోష్ కుటుంబానికి కొండంత అండసంతోష్ అకాల మరణంతో పెద్ద దిక్కును కోల్పోయి శోకసంద్రంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి తక్షణమే స్పందించారు. ఆ కుటుంబం రోడ్డున పడకూడదన్న సదుద్దేశంతో ఆయన ఆ కుటుంబానికి తక్షణ అవసరాల నిమిత్తం రూ. 50 వేల ఆర్థిక సాయం, ఆ కుటుంబానికి శాశ్వత ఆర్థిక భద్రతకు సంతోష్ భార్యకు తమ పాఠశాలలోనే ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. సంతోష్ కుమారుడి భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, తమ పాఠశాలలోనే అతనికి పూర్తిగా ఉచితంగా విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. కష్టకాలంలో ఉన్న ఒక ఉపాధ్యాయుడి కుటుంబానికి ఇంతటి అండగా నిలిచిన పాఠశాల చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి గొప్ప మనసుపై స్థానికులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్స్పండెంట్ నిమ్మ శేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సచిన్, పిఈటి శ్రీలత, నవనీత అనిఫ్, ఉపాధ్యా బృందం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర తైక్వాండో క్రీడలలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఈనెల 25, 26 ఆగస్టు 2026న తెలంగాణ రాష్ట్ర ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ –2026 హైద్రాబాద్ లోనీ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగగా యాదాద్రి భువనగిరి జిల్లా తైక్వాండో క్రీడాకారులు తమ ఉత్తమ ప్రతిభను చాటి జిల్లా కు 10 గోల్డ్ మెడల్స్, 5 సిల్వర్ మెడల్స్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ వ్యవస్థాపకులు, జిల్లా జనరల్ సెక్రటరీ గ్రాండ్ మాస్టర్ గుర్రం కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఏ.శివ ప్రసాద్, రాధా, భారత్ కుమార్, తల్లితండ్రులు పాల్గొని మెడల్స్ సాధించిన వారిని అభినందించారు.

## నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రపెన్సీలను సరిచేసుకోవాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణంలోని 24 వార్డులో బ్రాహ్మణ వీధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ వార్డు సభలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమంలో మ్యాపింగ్, 2002లో లేని ఓటర్ వివరాలు డాక్యుమెంట్ సమర్పించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఫారం–6 సమర్పించాలని తెలిపారు. అలాగే ఓటరు జాబితాలో పేరు, వయస్సు, చిరునామా, ఫోటో, బంధుత్వం తదితర వివరాల్లో సవరణలు అవసరమైతే ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు, బిఎల్ఓలు, బిఎల్ఏలు, సంబంధిత అధికారులు ఓటరు జాబితాను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచేసుకుని నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులుగా చంద్రశేఖర్, సంతోష్




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ మండల పిఆర్టియు అధ్యక్షులుగా శిరేగే చంద్రశేఖర్ , ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా గోపీచంద్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా సంగీత, ఉపాధ్యక్షులుగా సంతోష్ కుమార్, మహిళా ఉపాధ్యక్షులుగా కేశవి, కార్యదర్శులుగా సాయిలు, శంకర్ రెడ్డి, మహిళా కార్యదర్శులుగా వేదవతి, సృజన ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బీమ్లా నాయక్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలోపిఆర్టియు మెదక్ జిల్లా అధ్యక్షులు మేడి సతీష్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్, సుంకరి కృష్ణ, సత్యానారాయణ రెడ్డి, మహేష్ కుమార్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు,

## యూనిఫామ్‌లు పంపిణీ చేసిన డీఈవో రాజు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ ప్రారంభించారు. మెదక్ మండలం పాతూరు ప్రాథమిక ఉన్నత జిల్లా విద్యాధికారి రాజు విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. డిఆర్డిఓ ఆధ్వర్యంలో విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు యూనిఫామ్, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేసి ఉన్నత పౌరుల తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ మహాలక్ష్మి , రాజు, ఆపరేటర్ అరవింద్, వెంకటేష్, విఓఏ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోటకాడి తండా, కొటూరులో విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు.

## ఎమ్మెల్యే రోహిత్ కు రాఖీ కట్టిన మహిళా కౌన్సిలర్లు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ కు మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లు రాఖీ కట్టారు. ఆత్మీయ సోదర భావానికి ప్రతీక రాఖీ పండుగ అని ఎమ్మెల్యే రోహిత్ పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల రక్షణ రూప లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే కు రాఖీ కట్టిన వారిలో కౌజు మహిళా కౌన్సిలర్లు దొంతి లక్ష్మి భుజారంపేట అరుణ, రాగి వనజ, సంధ్య, పల్లె రాణి, రాజమ్మ, కొటాల లలిత, నస్రీన్, అనూష, శృతి పాల్గొన్నారు.


Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555